# లైంగిక సంబంధాలు ప్రకృతి నియమాలు



TP 172

Jinsi Talluqat Aur Qwanin-e- Fitrat
(Telugu)

# లైంగిక సంబంధాలు ప్రకృతి నియమాలు

మూలం

**మౌలానా మౌదూదీ**

అనువాదం

**అబుల్ ఫౌజాన్**


**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**
సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్
హైదరాబాద్-500 002. ఫోన్: 24564583

**Lyngika Sambandhalu- Prakruti Niyamalu**

**Jinsi Talluqat Aur Qwanin-e- Fitrat (Telugu)**

**TIP Series No.** : **172**

Written by : Moulana Maududi

Translated by : Abul Fouzan

All Rights Reserved with Publishers

3rd Edition : September 2016

Copies : 1000

**Price** : **Rs.35**

ISBN : 81-88241-72-5

Published by : Telugu Islamic Publications Trust
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# లైంగిక సంబంధాలు ప్రకృతి నియమాలు

ఇతర ప్రాణుల్లో, జీవజాలాల్లో ఉన్నట్లే, ప్రకృతి మానవుణ్ణి కూడా జంట (దంపతుల) రూపంలో సృష్టించింది. ఒకరి పట్ల ఇంకొకరు స్వాభావికం గానే ఆకర్షింపబడే రీతిలో ఆడ, మగ రూపంలో రూపొందించటం జరిగింది. అయితే ఇతర ప్రాణుల్లో, జంతువుల్లో ఈ వర్గ లేక లైంగిక విభజన, స్వాభావిక, సహజ ఆకర్షణలోని ముఖ్యఉద్దేశ్యం వాటి యొక్క ఉనికి లేక సంతానోత్పత్తి మాత్రమేనని అధ్యయనం వల్ల తేలింది. ఈ ప్రాణుల్లో వాటి ఉనికి, వారి జాతి నశించిపోకుండా ఉండేందుకై ఈ పరస్పర ఆకర్షణ అనే అంశాన్ని ఉంచటం జరిగింది. ఇది ఒక హద్దుకు, ఒక పరిమితికి లోబడి ఉండేటట్లు వారి స్వభావం మలచబడింది. అంటే వారిలో వ్యతిరేక లింగం పట్ల గల ఆకర్షణ, ప్రేమ, వాత్సల్యం సంతానోత్పత్తి వరకే పరిమితమై ఉంటుంది. కాని మానవుల్లో మాత్రం వ్యతిరేక లింగం పట్ల ఈ మొగ్గు, ఆపేక్ష అపరిమితమైనది, హద్దులు లేనిది. మిగిలిన జీవరాసులన్నిటి కంటే అధిక మోతాదులో ఉంది. సమయం, ఋతువు, కాలంతో ఇది పరిమితం చేయబడలేదు. అంతేకాదు ఫలానా పరిమితి దాటకూడదనే నియమం అతని స్వభావంలో ఎక్కడా కనబడదు. స్త్రీ పురుషులిద్దరూ పరస్పరం శాశ్వితమైన ఆకర్షణ కలిగి ఉంటారు. వీరిద్దరిలో ఒకరిపట్ల వేరొకరు ఆకర్షింపబడే, సమ్మోహితమయ్యే, విలీనమయ్యే లైంగిక ఆకర్షణకు సంబంధించిన అపరిమితమైన కారణాలను సమకూర్చటం జరిగింది. వారి హృదయాల్లో వ్యతిరేక లింగం పట్ల ప్రేమ, వాత్సల్యం, వ్యామోహాల అపరిమితమైన శక్తినుంచటం జరిగింది. వారి శరీర నిర్మాణంలో,

అవయవాల కూర్పుల్లో, రంగు రూపంలో, అంతెందుకు ఒక్కొక్క కదలికలో వ్యతిరేక లింగాన్ని ఆకర్షించుకునే గొప్పశక్తిని నింపటం జరిగింది. వారి మంద హాసంలో, వారి గొంతులో వారి కదలికల్లో, వారి అందచందాల్లో, వారి ఒక్కొక్క లక్షణంలో వ్యతిరేక వర్గాన్ని తమ వైపు లాక్కునే శక్తిసామర్థ్యాలను నూరి పోయటం జరిగింది. ఇదేకాక బాహ్య ప్రపంచంలో కూడా వీరు పరస్పరం ఆకర్షించుకొనబడేందుకు లెక్కలేనన్ని కారణాలను, సన్నివేశాలను సమకూర్చటం జరిగింది. గాలి వీయటంలో నీటి ప్రవాహంలో, గడ్డి పచ్చ దనంలో, పుష్పాల సువాసనల్లో, పక్షుల కిలకిల రావంలో, ఆకాశంలో ఏర్పడే మేఘాల్లో, చల్లని రాత్రుల్లో, ఒక్కటేమిటి ఇలా చెప్పుకుంటూ పోతే, ప్రకృతిలోని ప్రతి సౌందర్యం, ప్రతి ఆకర్షణ, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఈ లైంగిక ఆకర్షణకు, మోహానికి కారణభూతమవుతుందనటంలో ఏమాత్రం సందేహం లేదు.

ఇదేకాక మానవ శరీర నిర్మాణంపై దృష్టిసారిస్తే, మనకు కనబడే విషయం ఏమిటంటే లైంగికశక్తికి సంబంధించిన గొప్ప పెన్నిధి అతనిలో నింపటం జరిగింది. అయితే ఇదే శక్తి ఏకకాలంలో అతని లైంగికశక్తి గానే కాక, కార్యాచరణశక్తిగా, జీవన ప్రదాయినిగా కూడా పనిచేస్తుంది. ఏ గ్రంధులు (Glands) అయితే అతని అవయవాలకు జీవకణాలను (Harmones)ను ఉత్పత్తి చేస్తాయో, అతనిలో శక్తి, చురుకుదనం, వివేకం, ఆచరణకు దోహదపడతాయో, వాటికే లైంగిక సంభోగశక్తిని ఉత్పత్తిచేసే బాధ్యత కూడా అప్పగించటం జరిగింది. ఈ శక్తికి కార్యరూపం దాల్చటానికి కావలసిన ప్రేరణను కూడా అవే జన్మనిస్తాయి. కామానికి పురిగొలిపే లేక దానికి దోహదపడే సర్వకారణాలను అనగా రంగు రూపం, శోభ, శృంగారములకు సంబంధించిన విషయాలన్నిటి ద్వారా ఈ శక్తిని ప్రభావితం చేయడం కూడా ఈ గ్రంధుల (Glands) విధుల్లో చేరి ఉంది. అంతేకాక పైవాటి ద్వారా ప్రభావితమయ్యే కళ్ళు, చెవులు, ముక్కు- ఇంకా జ్ఞానేంద్రియాలన్నింటిని, అంతేకాక ఊహల్లో, ఆలోచనల్లో సైతం ఈ లైంగిక శక్తిపై ప్రభావం వేసే గుణాన్ని ఉత్పత్తి చేసే బాధ్యత కూడా ఈ గ్రంధులకే అప్పగించటం జరిగింది.

మానవుని మానసిక శక్తుల్లో కూడా ప్రకృతి నింపిన ఈ ప్రత్యేకశక్తి మనకు కనబడుతుంది. అతని మనోమస్తిష్కాల్లో ప్రేరణ కల్పించే శక్తుల సంబంధాలన్ని కేవలం రెండే రెండు విషయాలపై కేంద్రీకృతమయి ఉంటాయి. మొదటిది మనిషి తన ఉనికిని కాపాడుకోవటానికి, తన స్వప్రయోజనానికి, స్వీయసేవకు పురిగొల్పుతుంది. రెండవది వ్యతిరేక లింగంతో సంబంధానికి వివశున్ని చేస్తుంది. మానవుని కార్యాచరణ శక్తులు తమ సంపూర్ణ సామర్థ్యంతో పనిచేసే యవ్వనదశలో ఈ రెండవ వాంఛ- అనగా వ్యతిరేక లింగంతో సంబంధం ఎంత ప్రబలంగా ఉంటుందంటే, కొన్ని సందర్భాల్లో అది మొదటి వాంఛను- అనగా స్వప్రయోజనం, స్వీయరక్షణను కూడా నొక్కేస్తుంది. దీని ఫలితంగా మానవుడు ఎంత వివశుడై పోతాడంటే, అతడు తన ప్రాణాన్ని తన చేతులతో సమర్పించు కోవటానికీ, తెలిసితెలిసీ తనను తాను అంతం చేసుకోవటానికి సైతం సిద్ధపడతాడు.

## సమాజ నిర్మాణంలో లైంగికాకర్షణ ప్రభావం

ఇదంతా దేనికొరకు? మానవజాతి ఉనికిని కాపాడటానికా? కాదు. చేపలు, మేకలు ఇంకా ఇలాంటి జాతుల ఉనికిని కాపాడినంతగా, మానవజాతి ఉనికిని కాపాడటానికి ఇంతటి లైంగిక ఆకర్షణ అవసరం లేదు. ఈ జాతులన్నింటిలోకన్నా మానవజాతిలో అధిక లైంగికాకర్షణ ఉంచటానికి ప్రకృతి ఉద్దేశమేమిటి? ఈ ఆకర్షణకు లోనవటానికి అందరిలోకన్నా అత్యధిక అవకాశాలను, కారణాలను సమకూర్చటం ఎందుకు? ఇది మానవుని తృప్తి, సుఖం, రుచి, ఆహ్లాదం కొరకా? ఇది కూడా కాదు. ప్రకృతి ఎక్కడ కూడా రుచిని, తృప్తిని ప్రధానుద్దేశంగా, అసలు కారణంగా ఏర్పాటు చేయలేదు. అదొక గొప్ప ఉద్దేశాన్ని నెరవేర్చటానికి మానవులకు, పశువులకు వివశుల్ని చేసే ఉద్దేశంతో ఈ తృప్తిని, ఈ సుఖాన్ని కేవలం ఒక రుచిగా, ఒక ఎరగా మాత్రమే ఏర్పాటు చేసింది. ఎందుకంటే ఈ లైంగిక సంబంధాన్ని పరాయి కార్యంగా, ఇతరుల సేవగా భావించకుండా, స్వీయకార్యంగా, తనకు అత్యంత సుఖానిచ్చే కార్యంగా భావించటానికి మాత్రమే ఈ రుచిని జోడించింది.

ఇకిప్పుడు ఆలోచించండి. దీనికి సంబంధించి ప్రకృతి ముందున్న ముఖ్యఉద్దేశ్యం, ప్రధానకారణం ఏమై ఉంటుంది? మీరెంత గాఢంగా, సుదీర్ఘంగా ఆలోచిస్తే మీకు అర్థమయ్యేదేమంటే ప్రకృతి ఇతర ప్రాణులన్నిటి కన్నా మానవజాతిని సంస్కారవంతునిగా, సంఘజీవిగా మార్చటానికే చేసిన ఏర్పాటని ఒప్పుకోకుండా ఉండలేరు.

అందుకనే మానవుని మనోమస్తిష్కాల్లో లైంగిక ప్రేమ, ఆకర్షణను నింపటం జరిగింది. దీని ఉద్దేశం కేవలం శారీరక సంబంధం లేక సంభోగం ఎంతమాత్రం కాదు. దీనికి బదులు అదొక శాశ్విత సహచర్యం, హృదయపూర్వక సంబంధం మరియు అధ్యాత్మిక అనురాగాన్ని కోరుతుంది.

అందుకొరకే మానవునిలో లైంగికాకర్షణ, వాస్తవంలో అతనిలో ఉండబడిన లైంగిక సంభోగశక్తి కన్నా ఎన్నో రెట్లు అత్యధిక మోతాదులో ఉంచటం జరిగింది. అతనిలో ఉంచబడిన లైంగికార్షణ, లైంగిక కోరికను అదే నిష్పత్తిలో, కాదు కాదు పదవ నిష్పత్తిలో కూడా అతను లైంగిక సంభోగంలో గడిపితే అతని ఆరోగ్యం నాశనమైపోతుంది. సహజ వయస్సుకు చేరకముందే అతని శారీరక శక్తులు నశించిపోతాయి. ఈ విషయం వల్ల తేటతెల్ల మయ్యేదే మంటే మానవునిలో లైంగికార్షణ ఇతర జీవుల్లో కన్నా అధిక మోతాదులో ఉంచటం జరిగిందంటే, దాని అర్థం- ఇతర జంతువులకన్నా మనిషి అత్యధిక సార్లు సంభోగించటం అనేది ఎంతమాత్రం కాదు. దానికి బదులు స్త్రీపురుషుడు పరస్పరం కలిసి ఉండేటట్లు చేయుటం, వారి పరస్పర సంబంధంలో స్థిరత్వాన్ని, శాశ్వితను నెలకొల్పటమే దీని ముఖ్యఉద్దేశమని రూఢీ అవుతుంది.

దీనికోసమే స్త్రీలల్లో లైంగికార్షణ, లైంగిక కోరికతోపాటు సిగ్గు, బిడియం, తప్పించుకోవటం, పారిపోవటం, ఆపుకోవటం లాంటి గుణాల నుంచటం జరిగింది. ఇవి దాదాపుగా ప్రతి స్త్రీలో ఉంటాయి. ఈ ఆగిపోవటం, తప్పుకోవటం, దూరముండటమనే గుణాలు ఇతర జంతువుల ఆడ జాతుల్లో కూడా ఉంటాయి. కాని మానవ స్త్రీజాతిలో ఇది అత్యధిక పరిమాణంలో,

అత్యధిక మోతాదుల్లో ఉంటాయి. ఇంకా దీనికి సిగ్గు, బిడియాల్ని జోడించి ఈ గుణాన్ని ద్విగుణీకృతం చేయటం జరిగింది. దీని ద్వారా కూడా మానవునిలో ఉంచబడిన లైంగికాకర్షణ ముఖ్య ఉద్దేశం ఒక శాశ్విత సంబంధం కొరకే తప్ప ప్రతి లైంగి కాకర్షణ, లైంగిక సంభోగం కొరకు కాదనేది విశదమవు తోంది.

అంతేకాదు, మానవ శిశువు మిగిలిన జంతువుల పిల్లలన్నిటిలోకెల్లా అతి బలహీనంగాను, అత్యధికంగా ఇతరులపై ఆధారపడే విధంగాను పుట్టించడం జరిగింది. జంతువుల పిల్లలకన్నా, మానవ శిశువు ఎన్నో సంవత్సరాల వరకు తల్లిదండ్రుల సంరక్షణ మరియు తర్ఫీదుపై ఆధారపడి ఉంటుంది. తనను తాను సంభాళించుకోవటానికి, తన సహాయం తాను చేసుకొనే యోగ్యత వచ్చేవరకు ఆ శిశువుకు ఎన్నో సంవత్సరాలు పడతాయి. దీనిద్వారా కూడా స్త్రీపురుష కలయిక కేవలం లైంగిక సంబంధం వరకే పరిమితం కాదని, ఈ లైంగిక సంబంధ ఫలితాన్ని ఇరువురూ పరస్పర సహాయ సహకారాలతో నెరవేర్చక తప్పదని రుజువవుతుంది.

దీనికోసమే మానవుల హృదయాల్లో సంతాన ప్రేమ, ఇతర జంతువుల కన్నా అత్యధిక రెట్లు ఎక్కువగా ఉంచటం జరిగింది. పశువులు తమ సంతానాన్ని స్వల్పకాలమే పోషించిన తరువాత వాటినుండి దూరమైపోతాయి. ఆ తరువాత వాటిలో ఎలాంటి సంబంధముండదు. అంతేకాక ఒకరినొకరు గుర్తుంచుకోరు కూడా. దీనికి బదులు మానవుడు తన సంతానపు బాల్యావస్థ పోషణ వరకే కాకుండా ఆ తరువాత కూడా సంతాన ప్రేమలో చిక్కుకొని పోతాడు. అంతేకాదు, ఈ ప్రేమ, వాత్సల్యం, సంతానపు సంతానం వరకు కూడా ప్రాకుతూ పోతుంది. మానవునిలో తన సంతానం పట్ల గల ఈ ప్రేమ అతన్ని ఎంతగా వివశున్ని చేస్తుందంటే, మానవుడు తన స్వంతం కొరకు దేన్నైతే కోరుతాడో అంతకన్నా మిన్నది, అంతకన్నా అధికం తన సంతానం కోసం కోరుకుంటాడు. అతని హృదయ కుహరాల్లో నుండి వెలువడే కోరిక ఏమిటంటే,

తనకు అవకాశం లభించినంత వరకు తన సంతానం కోసం శ్రేష్ఠమైన, తాననుభవించిన దానికన్నా మిన్నదైన జీవిత సౌఖ్యం సమకూర్చాలని కోరు కుంటాడు. తను కష్టపడి తన జీవితంలో సంపాదించినదంతా తన సంతానం కోసం విడిచిపోతాడు. మానవ హృదయంలో సంతానం పట్ల ఇంత విపరీత మైన ప్రేమ సృజించిన ప్రకృతి కోరేదేమిటంటే, స్త్రీ పురుష లైంగికాకర్షణను ఒక శాశ్విత బంధంగా, అవిచ్ఛిన్న కలయికగా మార్చటం, ఈ శాశ్విత బంధాన్ని ఒక కుటుంబ నిర్మాణం కోసం వినియోగించటం, ఆ తరువాత ఈ రక్త సంబంధాల ప్రేమ అనేక కుటుంబాలను కలుపుతూ, ఒకరి ప్రేమలో ఇంకొకరిని బందిస్తూ, ఈ ప్రేమికుల శ్రేయోభిలాషుల మధ్య, మానవ సంతతి పురోగమిస్తూ, పరస్పర సహాయ సహకారాలతో ఒక సమాజాన్ని, ఒక సంస్కృతిని ఉనికిలోకి తేవటం ప్రకృతి ప్రధాన లక్ష్యం.

## సమాజ ప్రాథమిక సమస్య

పై వివరాల ద్వారా తేలేదేమంటే మానవ శరీరంలోని ఒక్కొక్క కణంలో, మానవ మస్తిష్కాల్లో నింపబడిన ఈ లైంగిక ఆకర్షణ, ఈ ఆకర్షణను ద్విగుణీ కృతం చేయటానికి విశ్వంలోని అడుగడుగున ఎన్నో కారణాలను, సాధనాలను సమకూర్చటం జరిగిందో, దీని ముఖ్య ఉద్దేశ్యం మానవుని ఒంటరితనాన్ని, సామాజిక వ్యవస్థ వైపుకు మరలించటం. ప్రకృతి ఈ ఆకర్షణను మానవ సంస్కృతికి మానవ సమాజ నిర్మాణానికి ప్రథమ మరియు ముఖ్య ఉద్దేశంగా నిర్ధేశించింది. ఈ ఆకర్షణ, ఈ మోహం ద్వారానే మానవజాతిలోని ఈ రెండు లైంగికవర్గాల్లో పరస్పర సంబంధం ఏర్పడుతుంది. ఈ సంబంధమే మానవ సామాజిక జీవితానికి (Social Life) ప్రారంభంగా మారుతుంది.

ఈ విషయం రూఢీ అయిపోయింది కనుక ఇక స్త్రీపురుష సంబంధం వాస్తవంలో సమాజానికి సంబంధించిన ప్రాథమిక సమస్య అనేది కూడా దానంతట అదే తేటతెల్లమవుతోంది. ఈ సమస్య యొక్క సరియైన, వాస్తవ మైన ప్రకృతి సహజమైన పరిష్కారంపైనే సమాజం యొక్క మంచి చెడు, మేలు లేక కీడు, సుస్థిరత లేక బలహీనతలు ఆధారపడి ఉంటాయి. మానవ

జాతి లోని ఈ రెండు లైంగిక వర్గాల సంబంధాల్లో ఒకటి పశువుల్లాంటి (మృగ) సంబంధం (వేరే మాటల్లో చెప్పాలంటే లైంగిక సంబంధం లేక లైంగిక వాంఛ) దీని ఉద్దేశం ఈ జాతి మనుగడను కాపాడటం తప్ప వేరేదికాదు. రెండవది మానవ సంబంధం. దీనిఉద్దేశం ఏమిటంటే ఇరువురు కలిసి ఉమ్మడి ఉద్దేశం కోసం, తమ తమ శక్తిసామర్థ్యాలను, తమ సహజ యోగ్యతలను దీనికి వినియోగించాలి. ఈ పరస్పర సహకారం కోసం వారిలో ఉంచబడిన ఈ లైంగిక ఆకర్షణ లేక ప్రేమ ఒక కేంద్రబిందువుగా పనిచేస్తుంది. ఈ జంతు పరమైన మరియు మానవపరమైన రెండు అంశాలు కలిసి, వారితో ఏక కాలంలో సమాజ నిర్వహణ బాధ్యతతోపాటే సమాజ వికాసం కోసం, సమాజ మనుగడ కోసం కొంగొత్త కార్యకర్తలను సమకూర్చే విధిని కూడా పూర్తి చేయి స్తాయి. పై రెండు అంశాలు అనగా పాశవిక మరియు మానవీయ అంశాల కలయిక సమతుల్యంగా, సమయోచితంగా, లక్ష్యసాధన దిశగా, హెచ్చు తగ్గులు లేకుండా సాఫీగా సాగినప్పుడే సమాజం మనగలుగుతుంది, వికాసం పొందగలుగుతుంది.

## శ్రేష్టసమాజ అవసరాలు

ఇక ఒకమంచి సమాజ నిర్మాణానికి స్త్రీ పురుష సంబంధాలు ఎలా ఉండాలి? అనే అంశంపై చర్చిద్దాం. స్త్రీ పురుష సంబంధాల్లోని పాశవిక మరియు మానవీయ సంబంధాలు సమతుల్యంగా, మధ్యస్థంగా ఎలా ఉండాలి? ఈ సంబంధాలు హద్దుదాటితే, అపరిమితమైతే, అసంతుల్యంగా మారిపోతే, మానవ సమాజంపై పడే వాటి దుష్ఫలితాలేమిటో, తద్వారా మానవ సమాజం ఏవిధంగా బలహీనమై, నిర్వీర్యమై చివరికి నాశనం వైపుకు ఎలా పయనిస్తుందో పరిశీలిద్దాం.

## లైంగిక ఆకర్షణ పరిమితి

మొట్టమొదటి మరియు ప్రథమ సమస్య, ఈ లైంగిక ఆకర్షణను ఏవిధంగా పరిమితితో, కట్టడిలో ఉంచాలి? ప్రపంచ ప్రాణులందరిలోకన్నా

మానవజాతిలో ఈ లైంగిక ఆకర్షణ అత్యధిక మోతాదులో ఉందని మనం పైన తెలుసుకుంటూనే వచ్చాము. మానవ శరీరంలోనే లైంగికవాంఛను రేకెత్తించే శక్తులే అత్యధికంగా ఉన్నాయంటే, బయట విశాలమైన విశ్వంలో కూడా నలువైపులా ఈ లైంగిక ఆకర్షణకు పురిగొలిపే కారణాలు, సాధనాలు అనేకం ఉన్నాయి. ఈ లైంగిక ఆకర్షణకు ప్రకృతే విస్తృతమైన ఏర్పాట్లు చేసినప్పుడు మానవుడు కూడా ధ్యాస, తన సృజనాశక్తిని ఈ వైపు మరలించి, ఈ లైంగిక ఆకర్షణను పెంపొందించటానికి ద్విగుణీకృతమే కాదు, ఎన్నో రెట్లు పెంచ టానికి ఈ లైంగికవాంఛను, ఈ దాహాన్ని పెంపొందించటమే కాక ఆ మితి మీరిన దాహాన్ని పూర్తిచేసుకోవటానికి ఎలాటి అడ్డంకులు, అవరోధాలు లేని సమాజ నిర్మాణానికి కృషి చేస్తుంటే, ఈ లైంగిక ఆకర్షణ లేక తృష్ణ తన హద్దుని, తన పరిమితిని అతిక్రమించి, పెడమార్గం పడుతుందనటంలో సందేహ మేముంటుంది? మానవునిలోని ఈ మృగత్వం, మానవపరమైన అంశాన్ని పూర్తిగా స్వాధీనపరుచుకుంటుంది. తద్వారా మానవునిలోని మానవత్వమే కాదు, అతని సమాజాన్ని కూడా పూర్తిగా నాశనం చేసేస్తుంది.

లైంగిక సంబంధం, ఆ సంబంధంలోని ఒక్కొక్క అంశాన్ని ప్రకృతి ప్రీతి పాత్రంగా, అహ్లాదాన్ని కలిగించేదిగా చేసింది. అయితే ఈ ఆనందం, ఈ సుఖం, ప్రకృతి తన బృహత్తరమైన ఒక ఉద్దేశం అనగా సమాజ స్థాపన కోసం ఒక రుచిగా మాత్రమే ఏర్పాటు చేసిందని మనం పైన తెలుసుకొంటూ వచ్చాము. ఈ రుచినే, ఈ సుఖాన్నే సర్వస్వం అనుకోవటం, ఇందులోనే మనిషి రాత్రిం బవళ్ళు గడపటం, దీనికోసమే అనేక సాధనాలను సృష్టించటం మానవ సమాజ వినాశనమే కాదు, ఖుద్దుగా మానవుని ఉనికికే ప్రమాదకారిగా మారవచ్చు, మారింది కూడాను. అనేక జాతులు దీనికి నిదర్శనంగా ఉన్నాయి. ఏ జాతులైతే ఈ పద్ధతిని, ఈ మార్గాన్ని అవలంబించాయో వాటి అవశేషాలను, వాటి చరిత్రను అధ్యయనం చేయండి. లైంగిక తృష్ణ వారిలో కట్టలు తెంచుకొని ప్రవహించసాగింది. వారి సాహిత్యం ఈ మృగతృష్ణతో నిండిఉండేది. వారి ఆలోచనలు, వారి కథానికలు, వారి కవిత్వం, వారి చిత్రాలు, వారి విగ్రహాలు, వారి ఆరాధనాలయాలు, వారి రాజప్రసాదాలు- ఒక్కటేమిటి ఎక్కడ చూసినా

ఈ లైంగికతృష్ణను రేకెత్తించే దృశ్యాలే కనబడతాయి. ఇవన్నీ కూడా ఈ లైంగిక ఉద్రేకతకు, లైంగిక తృష్ణకు దృష్టాంతాలు. ఇక ఇప్పుడు ఏ జాతులైతే ఈ వినాశం వైపుకు పయనిస్తున్నాయో వారి పరిస్థితుల్ని కూడా గమనించండి. వారు తమ లైంగిక తృష్ణను ఆర్ట్, కల్చర్, లిటరేచర్, అందం, శృంగారం- ఇలాంటి అందమైన ఎన్నిపేర్లు పెట్టుకున్నా వాస్తవం మారజాలదు. పేర్లు మారినంత మాత్రాన నిజం మారదు. సమాజంలో స్త్రీలకు స్త్రీలకన్నా పురుషుల సాంగత్యం, పురుషులకు పురుషులకన్నా స్త్రీల సాంగత్యం అత్యధికంగా తమ వైపుకు లాగటానికి కారణమేమిటి? స్త్రీ పురుషుల్లో తమ అందాన్ని ద్విగుణీ కృతం చేసుకోవాలని, తమలోని ఆకర్షణను పెంచుకోవటానికి రకరకాల అలంకరణలు చేసుకోవటానికి కారణభూతమేమిటి? స్త్రీ పురుషులు కలిసి ఉన్న ఉమ్మడి సొసైటీల్లో స్త్రీల అవయవాలు నగ్నపరచటానికి కారణ మేమిటి? ఏ కారణంగా స్త్రీ తన శరీరంలోని ఒక్కొక్క అవయవాన్ని అందరి ముందు ప్రదర్శిస్తున్నది? పురుషుల వైపునుండి ఇంకా, ఇంకా అనే ఫర్ మాయిషి దేనికోసం? నగ్న చిత్రాలు, నగ్న విగ్రహాలు, నగ్న నృత్యాలు అత్యధి కంగా ఎందుకు పాపులర్ అవుతున్నాయి? సినిమాల్లో ప్రేమ శృంగారరసభరిత సన్నివేశాలు, లైంగిక సంబంధాల సన్నివేశాలు చూపించనంతవరకు అవి ఎందుకు జనప్రియం కాలేకపోతున్నాయి?

ఇవీ ఇంకా ఇలాంటి అనేక విషయాలు లైంగిక తృష్ణను, కామాగ్నిని రేపేవి కాకుంటే ఇవి దేనికి ఉద్దేశింపబడినట్లు? ఏ సమాజంలోనైతే ఇంతటి విపరీతమైన లైంగిక తృష్ణ చోటుచేసుకుంటుందో, ఆ సమాజం పతనం కాక ఏమవుతుంది?

ఇలాంటి విపరీతమైన లైంగిక తృష్ణ, నిరంతర ఉద్రేకపూరిత వాతా వరణం పదేపదే పురిగొలిపే లైంగిక ఆకర్షణతో కూడిన సమాజంలో రాబోయే తరాలు బలహీనులుగా ఉండటం సహజమేకదా! శారీరక, మానసిక వికాసం కుంటుపడుతుంది. మనోమస్తిష్కాల శక్తులన్నీ చెల్లాచెదురైపోతాయి. ◆ వ్యభిచారం సర్వసాధారణమైపోతుంది.

◆ ఒక డాక్టర్ ఇలా వ్రాస్తున్నాడు. "యవ్వన ప్రారంభదశ అతి ముఖ్యమైన అనేక మార్పులతో కూడుకొని వుంటుంది. మనోమస్తిష్కాల్లోని శరీరంలోని అనేక చర్యల్లో, ఈ కాలంలో ఒక విప్లవాత్మకమైన స్థితి ఏర్పడు తుంది. ఇంకా అన్నిరకాలైన అభివృద్ధి, వికాసాలు ఏర్పడతాయి. ఒక మానవునికి ఈ కాలంలో సంభవించే సర్వమార్పులను భరించే శక్తి, వృద్ధీ వికాసాల కోసం అతనిలోని సర్వశక్తి అవసరమై ఉంటుంది. ఈ కారణంగానే వ్యాధులను ఎదుర్కొనే సహజశక్తి అంటే వ్యాధి నిరోధకశక్తి, ఈ కాలంలో అతనిలో బాగా తగ్గిపోతుంది. సామాన్య పురోగతి, అవయవాల్లో అభివృద్ధి, మానసిక, శారీరక మార్పులకు సంబంధించిన ఈ సుదీర్ఘచర్య బాలుని నుండి యువకునిగా మారే ఈ క్రియ ఎంతటి శ్రమ, అలసటతో కూడుకున్నదంటే, ఈ కాలంలో శరీర ఆరోగ్యం అత్యంతగా అలసట, ప్రయాసలకు లోనవుతుంది. ఈ కాలంలో అతనిపై అసహజమైన బరువును, ఒత్తిడిని వేయటం ఎంతమాత్రం సమంజసం కాదు. ప్రత్యేకించి లైంగిక సంబంధం, లైంగిక ఉద్రేకతలైతే అతనికి వినాశకరంగా పరిణమిస్తాయి.

జర్మనీకి చెందిన ఇంకొక ప్రఖ్యాత మానసిక శాస్త్రవేత్త ఇలా వ్రాస్తు న్నాడు. "లైంగిక అవయవాలు సంబంధం రుచి, ఉత్సాహాలతో కూడుకున్న అసామాన్యమైన ఉద్రేకాల (Sensations)తో ఉంటుంది. అందుకని ఈ అవయవాలు మన మానసికశక్తుల్లోని ఒక పెద్దబాగాన్ని తమ వైపుకు ఆకర్షించుకోవటానికి లేక వేరొక విధంగా చెప్పాలంటే దోపిడీకి పాల్పడటానికి సదా సర్వసన్నద్ధంగా ఉంటాయి. వీటికే కనుక అవకాశమిస్తే అవి మానవున్ని సాంఘిక బాధ్యతనుండి మళ్ళించి, వ్యక్తిగత కామపిపాసలో ముంచివేస్తాయి. మానవ అవయవాల్లో వాటికి లభించి ఉన్న ఈ శక్తివంతమైన స్థానం, మాన వుని లైంగిక జీవితాన్ని, ఏ కొద్దిపాటి ఏమరుపాటు జరిగినా మితంనుండి అపరి మితం వైపుకు, మేలునుండి కీడువైపుకు లాక్కెళ్ళుతుంది. ఈ ప్రమాదాన్ని ఆపటమే విద్యయొక్క ప్రథమ లక్ష్యం కావాలి. సుఖవ్యాధులు, లైంగిక వ్యాధులు సర్వత్రా వ్యాపించిపోతాయి. గర్భనిరోధం, గర్భవిచ్ఛిన్నం, శిశు

హత్యలాంటి ఉద్యమాలు ఉనికిలోకి వస్తాయి. స్త్రీపురుషులు పశువుల్లాగా విచ్చలవిడిగా కలుస్తుంటారు. ఇంకా మానవుల్లో ఉంచిన ఈ అత్యధిక లైంగిక ఆకర్షణ మూలంగా, వారు ప్రకృతి ఉద్ధేశాన్ని నెరవేర్చకపోవటమే కాకుండా పశువులకన్నా హీనస్థాయికి దిగజారిపోతారు. పశువులు ఒక కాలాన్ని, ఒక ఋతువును ఎంచుకుంటాయి. కాని వీరు అంతకన్నా దిగజారిపోతారు. చివరికి గొర్రెలు, కోతుల కన్నా వీరు హీనమైపోతారు. ఇలాంటి విపరీతమైన మృగత్వం ఫలితంగా మానవ సభ్యతా సంస్కృతులే కాదు, ఖుద్దుగా మానవత్వమే నాశనమైపోతుంది. ఎవరైతే ఇలాంటి నైతిక రుగ్మతల్లో కూరుకుపోతారో, వారు ఎలాంటి నైతిక పతనానికి గురవుతారంటే అక్కడినుండి తిరిగి లేవటం వారికి సాధ్యపడే విషయం కాదు.

ఇక లైంగిక సంబంధాలంటేనే చీదరించుకునే సమాజ ఫలితం కూడా ఇలాగే బయల్పడుతుంది. లైంగిక ఆకర్షణ హద్దులు అతిక్రమిస్తే ఏ పరిణామాలు ఏర్పడతాయో అదేవిధంగా ఈ సంబంధాలను, ఆకర్షణను అత్యధికంగా తొక్కిపెట్టి, చితక గొట్టినా అవే దుష్ఫలితాలు ఏర్పడతాయి. ఏ జీవన వ్యవస్థ లేక సమాజం మానవున్ని సన్యాసము, బ్రహ్మచర్యం వైపుకు తీసుకు వెళ్ళాలని కోరుతుందో, వాస్తవంలో అది ప్రకృతితో పోరాడదలుస్తుంది. అయితే ప్రకృతి ఎప్పుడూ అపజయమెరుగదు. అంతేకాదు, ఎదురీదే వాన్ని నాశనం చేసిగాని విడిచిపెట్టదు. సిసలైన బ్రహ్మచర్య సిద్ధాంతమైతే ఒక సమాజానికి, ఒక సంస్కృతికి పునాది లేక ఆయువుపట్టు కాజాలదనేది అందరికీ తెలిసిన విషయం. ఎందుకంటే సిసలైన బ్రహ్మచర్యం పాటిస్తే ఒక సమాజం, ఒక సంస్కృతి అసలు ఉనికిలోకే రాదు. కనుక బ్రహ్మచర్య సిద్ధాంతాలను మనసుల్లో ధృడంగా నాటి మానవ సమాజంలో లైంగిక సంబంధాల పట్ల ఒక విధమైన వ్యతిరేకతను రేకెత్తించవచ్చును. తద్వారా సమాజంలో లైంగిక సంబంధాన్ని ఒక నీచమైన, అసహ్యామైన, జుగుప్సాకరమైన సంబంధంగా చూసే వాతావరణాన్ని నెలకొల్పవచ్చును. దీన్నుండి దూరముండటాన్ని నైతికోన్నతికి సూచనగా భావించటం, సాధ్య మైనన్ని విధాల ఈ సంబంధాన్ని, ఈ ఆకర్షణను

తొక్కివేయటం. అయితే ఈ లైంగిక ఆకర్షణ చితికిపోవటమనేది మానవత్వానికే తీరనిలోటు. అది తానొంటరిగా చితికిపోదు. తనతోపాటుగా మానవుల్లోని తెలివితేటల్ని, కార్యాచరణశక్తిని, ఉద్దేశ సంకల్పాలను, శక్తిసామర్థ్యాలను, ధైర్యస్థైర్యాలను, సర్వాన్ని తీసుకొని గాని మరీ చితికిపోదు. ఇది నశించిపోవటం వల్ల మానవునిలోని సర్వశక్తులు మొద్దుబారిపోతాయి. అతని రక్తం చల్లబడి, గడ్డకట్టిపోతుంది. అతనిలో పురోగమించే యోగ్యత నశించిపోతుంది. ఎందుకంటే మానవునికి ప్రేరణనిచ్చే గొప్పశక్తి ఈ లైంగిక శక్తియే.

అందుకని లైంగిక సంబంధాల్లో ఎలాంటి హెచ్చుతగ్గులకు తావీయకుండా మధ్యస్త మార్గంలో, సమతుల్యంతో, ఒక సముచిత నిబంధనతో దీన్ని నియంత్రించటం (Regulate) ఒక మంచి సమాజపు ప్రథమ కర్తవ్యం. మానవుడు స్వయంగా తన ఉద్దేశ్యం తన కృషితో, తన మితిమీరిన కాంక్షకోసం, అసహజమైన (Abnormal)రీతిలో ఈ లైంగిక ఆకర్షణను పురిగొల్పుతాడో, ఆ సాధనాలన్నిటిని ఒకవైపు ఆపేస్తూనే, వేరొకవైపు సహజమైన (Normal) ప్రకృతి సిద్ధమైన తృప్తిని, సమ్మతిని కలిగించే ప్రకృతి ఆకాంక్ష మేరకు దీనికి ద్వారాలు తెరువాలి.

## కుటుంబ నిర్మాణం

ఇకిప్పుడు ఒక ప్రశ్న జనిస్తుంది. అదేమిటంటే అసలు ప్రకృతి ఉద్దేశమేమిటి? ఈ విషయంలో మనల్ని అజ్ఞానంలో విడిచిపెట్టటం జరిగిందా? కళ్ళు మూసుకొని దేనిమీద చేయిపడితే అదే నిజమనుకొని అదే ప్రకృతి ఉద్దేశమని భావించాలా? లేక ప్రకృతి సిద్ధాంతాలపై దృష్టిని సారిస్తే, మనం ప్రకృతి ఉద్దేశాన్ని తెలుసుకోగలమా? చాలామంది బహుశ మొదటి విషయాన్నే అవలంభిస్తారేమో! ఎందుకంటే వారు ప్రకృతి సిద్ధాంతాలపై దృష్టిని సారించకుండానే తమకు నచ్చినది ఏదైనాసరే దాన్ని ప్రకృతి ఉద్దేశంగా పేర్కొంటారు. అయితే ఒక అన్వేషి వాస్తవమేమిటో తెలుసుకోవటానికి బయలు దేరుతాడో, కొన్ని అడుగులు వేయగానే ఖుద్దుగా ప్రకృతే తానేమీ కోరుతున్నాడో వేలెత్తి చూపినట్లుగా వాస్తవం ప్రకృతి ఉద్దేశం అతని కంటపడుతుంది.

ఇతర పశుపక్షాదుల మాదిరిగానే మానవజాతిని కూడా ఆడ మగ అనే రెండు లైంగిక వర్గాల్లో పుట్టించి, వారిలో లైంగిక ఆకర్షణను ఉంచి, తద్వారా వారి సంతతి ఉనికిని కాపాడాలనేది ప్రకృతి ఉద్దేశమనేది అవలీలగా అర్థ మయ్యే విషయం. కాని మానవజాతితో, ప్రకృతి కేవలం మానవ ఉనికి మాత్రమే కోరటంలేదు. అంతకుమించి ఇంకొన్ని ఉద్దేశాలున్నాయి ప్రకృతికి. మానవ జాతితో ప్రకృతి కోరేదేమిటి? ఆ కోరికల ప్రత్యేకత ఏమిటో కూడా మనకు అర్థం కానివి కావు.

ప్రప్రథమంగా మనకు కనబడేది మానవ శిశువు బలహీనత. అన్ని జంతువుల పిల్లలకన్నా మానవ శిశువు తన పోషణ, సంరక్షణ కోసం ఎంతోకాలం, ఎంతో శ్రద్ధ, మరెంతో బలిదానాన్ని కోరుతాడు. అతన్ని కేవలం ఒక జంతు పరంగా చూసినా కూడా తన జంతుపరమైన అవసరాలు అనగా ఆహార సేకరణ, స్వీయరక్షణలాంటి కనీస అవసరాలు తీర్చుకునే స్థోమత వచ్చేవరకు ఎన్నో సంవత్సరాలు పడతాయి. అంతేకాదు, ప్రారంభంలోని రెండు మూడు సంవత్సరాలైతే అతనెంతగా నిస్సహాయుడై ఉంటాడంటే, తల్లియొక్క నిరంతర పర్యవేక్షణ లేనిది అసలతను బ్రతకజాలడు.

మానవుడు అనాగరిక, అజ్ఞానకాలపు ప్రారంభదశలో ఉన్నా కూడా, అతడు కేవలం పశువు కాదని మనం గుర్తించకతప్పదు. ఏదో ఒక రకమైన సాంఘికత్వం అతని జీవితానికి అనివార్యం. ఈ సామాజికత వల్ల సహజసిద్ధ మైన సంతానపాలన పోషణ అవశ్యకతకు సంబంధించి అనివార్యమైన ఇంకా రెండు అవశ్యకతలు పెరిగిపోతాయి. ఒకటి ఆ శిశువు పాలన పోషణలో నిమగ్నమైన వ్యక్తికి ఆ సంఘం లేక ఆ సమాజం తనకు సాధ్యమైనన్ని సహాయ సహకారాలు అందించాలి. రెండవది, ఆ శిశువుకు ఎలాంటి సంస్కారమివ్వా లంటే, ఏ సంఘంలో లేక సమాజంలో అతను కళ్ళు తెరిచాడో, ఏ సమాజమైతే అతన్ని పాలించి, పోషించి తర్ఫీదునిచ్చిందో, ఆ సమాజ మనుగడ కోసం, ఆ సమాజమనబడే ఫ్యాక్టరీని నడపటానికి పాత కార్మికుల స్థానాన్ని అతను పూరించటానికి సంసిద్ధుడై ఉండాలి.

ఒక సమాజ సంస్కృతి ఎంత ఉన్నతమవుతుందో, పురోగవృద్ధి చెందు తుందో, ఈ రెండు ఆవశ్యకతలు కూడా అంతే బరువైనవిగా బాధ్యతాయుత మైనవిగా మారుతూపోతాయి. ఒకవైపు సంతానపాలన పోషణ కోసం అనివార్య మైన అవసరాలు, సాధనాలు పెరుగుతూ పోతాయి. రెండవవైపు సమాజం తనకోసం, తనఉనికి కోసం, తన హోదాను, తన అంతస్తును అనుసరించి మంచి కార్యకర్తల్ని విద్యాసంస్కారాలు కలిగిన కార్యకర్తల్ని కోరుతుంటుంది. అంతేకాదు, తన వృద్ధివికాసం కోసం తనకు శ్రేష్టత ప్రసాదించటం కోసం, ప్రతి కొత్తతరం వెనుకటి తరం కన్నా శ్రేష్టమైనదిగా తేవాలని కోరుకుంటుంది. వేరే మాటల్లో చెప్పాలంటే, ప్రతి శిశువును పోషించే సంరక్షకుడు, ఆ శిశువును తనకన్నా ఉన్నతునిగా, శ్రేష్టునిగా రూపొందించాలి. **అత్యంత** కఠోరమైన బలిదానం- అంటే తనకు తాను కష్టనష్టాలకు గురిచేసి కూడా స్వీయ సుఖ సంతోషాలను త్యజించి కూడా- తన సంరక్షణలో ఉన్న శిశువును తనకంటే మేలైన కార్యకర్తగా రూపొందించి సమాజానికి అందించాలి.

ఇది మానవ నైజం కోరే కోరికలు. ఈ కోరికలకు ప్రథమ సంబోధి స్త్రీ. మగవాడు ఒక్క క్షణం కోసం ఒక స్త్రీతో కలిసి, ఆ తరువాత శాశ్వితంగా ఆ స్త్రీతో ఆ కలయిక బాధ్యతతో దూరమై పోగలడు. కాని ఆ కలయిక వల్ల ఏర్పడే ప్రకృతి ఫలం, ఒక స్త్రీని ఎన్నో సంవత్సరాల వరకు ఇంకా చెప్పాలంటే జీవితాంతం వరకు విడిచిపెట్టదు. గర్భం దాల్చిన తరువాత కనీసం ఐదారు సంవత్సరాల వరకు ఈ 'ఫలం లేక ఫలితం' ఆమెను ఏవిధంగానూ విడిచి పెట్టదు. ఇక సామాజిక బాధ్యతలను నెరవేర్చాలంటే, ఇంకా పదిహేను సంవత్సరాల వరకు ఈ బరువును మోస్తూనే ఉండాలి. ఒక్క క్షణం కోసం మగవాని సాంగత్య రుచిని చూసిని స్త్రీ, దాని ఫలితభారాన్ని పదిహేను సంవత్స రాల వరకు మోస్తూపోవాలా? సంయుక్తంగా నిర్వహించిన ఒక కార్య ఫలితాన్ని, బాధ్యతను, కేవలం ఒకే ఒక వ్యక్తి ఎలా స్వీకరిస్తాడు? అనేది ప్రశ్న. ఎంతవరకైతే ఒక స్త్రీకి, ఈ కార్యంలో పాలుపంచుకున్న వ్యక్తి యొక్క విశ్వాసం, నిజాయితీలపై నమ్మకం ఏర్పడదో, ఎంతవరకైతే తన బిడ్డపోషణ విషయంలో

సంపూర్ణ విశ్వాసం ఏర్పడదో, ఎంత వరకైతే ఆ స్త్రీకి స్వయంగా తన జీవిత అవసరాలు తీర్చే బాధ్యతనుండి దాదాపుగా విముక్తి కలగదో, ఆమె ఇంత బృహత్తర కార్యభారాన్ని మోయటానికి ఎందుకు అంగీకరిస్తుంది? ఒక స్త్రీకి సంరక్షకుడు, పోషకుడు (Protector, Provider) ఎవరూ లేనప్పుడు గర్భం దాల్చటం అనేది ఆమెకు ఒక దుర్ఘటన, ఒక ఆపద. ఇంకా చెప్పాలంటే ప్రమాదకర విషయం. అందుకని ఈ ప్రమాదం నుండి, ఈ దుర్ఘటన నుండి ఆమె తప్పించుకోవటానికి ప్రయత్నించటం సహజం. ఏకాకిగా, నిస్సహాయురాలిగా, ఎన్నో సంవత్సరాల వరకు మోయవలసిన ఈ భారాన్ని ఆమె ఎలా స్వాగతించగలదు?

అందుకని- మానవజాతి మనుగడ కోసం, సమాజ స్థాపన, దాని పురోగతి కోసం అనివార్యమైన విషయం ఏమిటంటే ఏ మగవాని ద్వారానైతే ఒక స్త్రీ గర్భం దాల్చుతుందో, ఆ గర్భఫలితాన్ని, ఆ శిశువు సంరక్షణా భారాన్ని మోయటంలో కూడా అతను ఆమెకు సహాయకారి కావాలి. అయితే ఈ సహకారానికి అతన్ని ఒప్పించేదెలా? అతనైతే స్వతహాగా స్వప్రయోజనాపరుడు (Selfish). మానవజాతి మనుగడకు సంబంధించినంత వరకు, ప్రకృతి నియమం ప్రకారం, స్త్రీ గర్భం దాల్చటంతోనే అతని బాధ్యత తీరిపోతుంది. ఆ తరువాత ఆ బాధ్యత లేక భారం స్త్రీని పట్టుకుంటుంది. పురుషునికి ఈ భారంతో ఎలాంటి సంబంధముండదు. ఇక లైంగిక ఆకర్షణకు సంబంధించి చెప్పాలంటే ఇదే స్త్రీని అంటిపెట్టుకొని ఉండమని అదేమి ప్రేరేపించదు. లైంగిక ఆకర్షణకు కావలసింది వ్యతిరేక లింగం. అందుకని అతను తలుచుకుంటే ఈమెను కాదని రెండవ స్త్రీతో, రెండవది కాదని మూడవస్త్రీతో సంబంధం ఏర్పరుచుకుంటాడు. ప్రతిచోట విత్తనాన్ని వెదజల్లుతూపోతాడు. అందుకని ఈ విషయం అతని ఇష్టాయిష్టాలపై వదిలిపెడితే అతను సంతోషంగా ఎందుకని ఈ భారాన్ని, ఈ బాధ్యతను మోయటానికి సంసిద్ధుడవు తాడు. తన కష్టార్జితాన్ని ఆ స్త్రీ, ఆ శిశువుపై వెచ్చించటానికి అతని వివశున్ని చేసే శక్తి ఏది? ఇంకొక అందమైన యువతితో సంబంధం ఏర్పరుచుకోక, కడుపుబ్బిఉన్న ఈ స్త్రీని

అంటుపెట్టుకుని ఎందుకుంటాడు? పనికిరాని ఒక మాంసపు ముద్దపై ఎందుకు తన కష్టార్జితాన్ని వెచ్చిస్తాడు. అనవసరమైన, అసందర్భమైన అతని కేకలకు తన మధురమైన నిదురను పోగొట్టుకుంటాడు? ఈ చిన్ని తుంటరి ద్వారా ఇంట్లోనున్న ఖరీదైన వస్తువుల్ని నష్టపడుతూ ఎందుకు చూస్తుంటాడు? ఇంట్లో అంత మలినాన్ని వ్యాపింపజేస్తూ, ఎవరి మాటను ఖాతరు చేయని ఈ చిన్నారి చేష్టలకు అతనెందుకూరుకుంటాడు.

ఈ సమస్యకు పరిష్కారం కొంతవరకు ప్రకృతే ఏర్పాటు చేసింది. స్త్రీకి అందచందాలు, మాటల్లో తీయదనం, మృదుత్వం, హృదయాలను ఆకట్టుకొనే శక్తి, ప్రేమ కోసం త్యాగం, బలిదానం చేసే యోగ్యతల్ని ప్రసాదించింది. ఈ ఆయుధాలతో పురుషునిలో ఉండబడిన వ్యక్తిగత మరియు స్వప్రయోజనా పరత్వాన్ని జయించి, తనవానిగా చేసుకోగలగాలని ప్రకృతి ఉద్దేశం. అంతేకాక శిశువులో కూడా ఒక విచిత్రమైన ఆకర్షణాశక్తిని, తనవైపు లాక్కునే గుణాన్ని సృజించటం జరిగింది. తద్వారా బాధాకరమైన, నష్టదాయకమైన మరియు అమాయకత్వంతో కూడిన అతని చర్యల్ని సహిస్తూకూడా తల్లిదండ్రుల్ని తన ప్రేమలో బంధించి ఉంచగలుగుతాడు. అయితే కేవలం వీటిమూలంగానే మానవుడు ఎన్నో సంవత్సరాల వరకు నష్టాన్ని, కష్టాన్ని సహిస్తూ త్యాగం చేస్తూ తన నైతికమైన, ప్రకృతి సహజమైన, సాంఘిక పరమైన బాధ్యతల్ని నెరవేర్చ గలడా? ఎందుకంటే అతని చిరకాల శత్రువు అయిన 'షైతాన్' అతన్ని వెన్నంటి ఏ కొద్ది పొరపాటు జరిగినా అతని ప్రకృతి సహజమైన మార్గంనుండి తప్పించటానికి పొంచి ఉన్నాడు. అతని వద్ద సర్వకాలాల, సర్వ తరాల ప్రజల్ని మోసగించటానికి రకరకాల సిద్ధాంతాలు, ప్రలోభాలతో కూడిన అంబులపొది ఉంది.

ఇది కేవలం ధార్మిక మహాత్యం అనుకోండి! అది మానవున్ని స్త్రీపురుషులిద్దరిని తన జాతి మరియు సమాజం కోసం త్యాగం చేయటానికి సంసిద్ధం చేస్తుంది. ఈ స్వార్థపరుడైన పశువుని, మానవునిగా తీర్చిదిద్ది, త్యాగానికి పురిగొల్పుతుంది. దైవం ద్వారా పంపబడిన ఆ పుణ్యపురుషులు, ఆ ప్రవక్తలే

ప్రకృతి ఉద్దేశాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకొని స్త్రీ పురుషుని మధ్య సంబంధం, సామాజిక సహకారానికి అపురూపమైన విధానం 'వివాహాన్ని' పరిచయం చేశారు. వీరి బోధనలు, ఆదేశాల మూలంగానే ప్రపంచంలోని ప్రతిజాతిలో, భూగోళంలోని ప్రతి ప్రాంతంలో వివాహ సంప్రదాయం ఏర్పడింది. వీరు వ్యాపింపజేసిన నైతిక సూత్రాల ద్వారానే మానవునిలో ఈ బాధ్యతను నెరవేర్చటంలో వచ్చే కష్టనష్టాలను భరించే అధ్యాత్మిక యోగ్యత జనించింది. ఇదే కనుక లేకపోతే తల్లిదండ్రులకు మించిన శత్రువు ఒక శిశువుకు వేరెవ్వరూ ఉండేవారు కాదు. వారు ఏర్పరిచిన సామాజిక సూత్రాల మూలంగానే కుటుంబ వ్యవస్థ ఉనికిలోకి వచ్చింది. యువతీ, యువకుల్ని బాధ్యతాయుతమైన సంబంధం ఏర్పరుచుకోవటానికి మరియు పరస్పర సహకారం కోసం ఈ వ్యవస్థే ఈ పద్ధతులే తన పట్టులో గట్టిగా బిగించి ఉంచింది. ఇదే కనుక లేకపోతే యవ్వనపు తీవ్రమైన శారీరక కోరికలు, ఎలాంటి బాహ్యానియమాలు, ఆంక్షలు లేకుండా కేవలం నైతిక బాధ్యతల భావనలతో కట్టడి కాజాలవు. వారిని ఆంక్షలు లేని కామకార్యకలాపాలకు పాల్పడకుండా అపజాలవు. కామోద్రేకం ఖుద్దుగా సామాజిక శత్రువు (Anti Social). ఇది స్వార్థపరమైన, వ్యక్తిపరమైన మరియు విశృంఖలత్వంతో కూడుకున్న క్షణిక ఉద్రేకం. ఇందులో నిలకడలేదు. ఇది బాధ్యతనెరుగదు. ఇది కేవలం తాత్కాలిక సుఖం కోసం ప్రేరేపిస్తుంది. ఈ భూతాన్ని బంధించి, దీన్ని సామూహిక జీవితం కోసం నిలకడ, సహనం, కష్టం, త్యాగం, బాధ్యత మరియు నిరంతర శ్రమతో కూడిన జీవితం కోసం దీని సేవలు వినియోగించటం మామూలు విషయం కాదు. ఈ భూతాన్ని ఒక పద్ధతి ప్రకారం బంధించి దానిలోని తుంటరితనాన్ని, విశృంఖలత్వాన్ని లాక్కుని, సామూహిక జీవన వ్యవస్థ నిర్మాణానికి అనివార్యమైన స్త్రీపురుషుల నిరంతర శ్రమ మరియు పరస్పర సహాయసహకారాల పరిధిలో బంధించి ఉంచగలిగిన మహత్తర రూపం వివాహ చట్టం, కుటుంబ వ్యవస్థ. ఈ వ్యవస్థ, ఈ చట్టమే కనుక లేకపోతే మానవ సమాజ ఉనికే సమాప్తమైపోతుంది. మానవులు,

పశువుల్లాగా మెదలటం మొదలెడుతారు. చివరికి మానవజాతి ఉనికే ప్రపంచం నుండి నామరూపాల్లే కుండా నశించిపోతుంది.

అందుకని లైంగిక ఆకర్షణను, విశృంఖలత్వం మరియు విపరీత ధోరణుల నుండి ఆపేసి, దానికి స్వాభావికమైన మరియు సంతృప్తికరమైన-ఖుద్దుగా ప్రకృతి కోరుకునే మార్గాన్ని చూపించాల్సి ఉంది. అదేమిటంటే స్త్రీపురుషుల మధ్య శాశ్విత సంబంధాన్ని ఏర్పరిచే వివాహ వ్యవస్థ. తద్వారా కుటుంబ వ్యవస్థకు పునాది ఏర్పాటు కావాలి. సమాజమనబడే బృహత్తర ఫ్యాక్టరీకి అవసరమయ్యే కార్యకర్తలు, ఈ కుటుంబమనబడే చిన్న కార్ఖానా నుండి లభ్యమవుతారు. యువతీయువకులు యుక్తవయస్కులు కాగానే, సమాజఫ్యాక్టరీ పర్యవేక్షకులు సముచితమైన జతలను ఏర్పాటు చేయటానికి తమంతట తామే ఆలోచింప మొదలెడతారు. అత్యంత సముచితమైన, యోగ్య మైన మరియు అనుకూలమైన జంటలను ఏకంచేసి, తద్వారా పూర్వం కన్నా ఇంకా మంచి కార్యకర్తలను సమాజానికి అందించాలని వారు కోరుకుంటారు. ఈవిధంగా ఏ తరం అయితే బయటపడుతుందో, దాన్ని హృదయపూర్వకంగా, అన్నివిధాల తీర్చిదిద్ది, ఉత్తమమైన పౌరునిగా యోగ్యమైన కార్యకర్తగా రూపొం దించాలని సమాజంలోని ప్రతి వ్యక్తి తన వంతు కృషి చేస్తాడు. ప్రపంచంలోకి వచ్చి కళ్ళు తెరవగానే ఒక శిశువుకు కుటుంబ పరిధిలో ప్రేమ, వాత్సల్యం, శ్రేయం మరియు తర్ఫీదుకు సంబంధించి ఎలాంటి వాతావరణం లభిస్తుం దంటే అదతని పురోగవృద్ధికి అమృతంగా పనిచేస్తుంది. వాస్తవం చెప్పాలంటే ఒక శిశువుకు కేవలం కుటుంబ వ్యవస్థలో మాత్రమే అమితంగా ప్రేమించ టమే కాదు, తమకన్నా ఉన్నతునిగా, తమకన్నా యోగ్యునిగా తీర్చిదిద్దాలనే ప్రగాంఢవాంఛ ఉన్న దగ్గరి బంధువులు లభ్యమవుతారు.

ప్రపంచంలో కేవలం తల్లిదండ్రులు మాత్రమే తమ సంతానం తమ కన్నా ఉన్నతస్థాయికి చేరాలని, అన్నివిధాల తమకన్నా మేలైన, శ్రేష్టమైన స్థితిలో ఉండాలని హృదయపూర్వకంగా కోరుకుంటారు. ఈ కోరిక, ఈ వాంఛ ప్రతి తల్లిదండ్రుల్లోనూ సహజంగానే ఉంటుంది. అందుకని వారు అనాలోచితం

గానే, తెలియకుండానే రాబోయే తరాన్ని ప్రస్తుత తరంకన్నా మేలైనదిగా తీర్చిదిద్ది మానవ సమాజ వికాసానికి తోడ్పడుతుంటారు. వారి ఈ ప్రయత్నంలో స్వార్థమనే పదానికి స్థానమే లేదు. వారు తమ కోసం ఏదీ కోరుకోరు. వారు కేవలం తమ బిడ్డ శ్రేయాన్ని మాత్రమే కోరుకుంటారు. అతను యోగ్యుడుగా, సఫలీకృతుడై బయటపడితే అదే తమ కష్టానికి ప్రతిఫలంగా వారు భావిస్తుంటారు. ఇలాంటి శ్రేయోభిలాషులైన కార్యకర్తలు (Labourers) ఇలాంటి నిస్వార్థులైన సేవకులు (Workers), కుటుంబ వ్యవస్థని కాదని ప్రపంచంలో బయట ఎక్కడ దొరుకుతారు? మానవ సంతతి కోసం, ప్రతిఫలం కోరని సేవను చేస్తూ తమ సమయాన్ని, తమ సుఖాన్ని, తమ శక్తిసామర్థ్యాల్ని, తమ కష్టార్జితాన్ని సర్వస్వాన్ని ధారబోసి ఈ బాధ్యతను నెరవేర్చేవారు వేరెవరుంటారు? తమ కష్టఫలాల్ని తాము కాక, వేరొకరు అనుభవిస్తారని తెలిసికూడా ఈ త్యాగానికి సిద్ధపడేవారు ఇంకెక్కడుంటారు? ఇతరుల కోసం యోగ్యులైన కార్యకర్తల్ని అందించామనే తృప్తి తప్ప ఇంకేమి కోరని త్యాగశీలులు ఇంకెందరుంటారు? ఇంతటి పవిత్రమైన మరియు మహోన్నతమైన 'వ్యవస్థ' మానవత్వంలో వేరేదైనా ఉందా?

ప్రతి సంవత్సరం మానవ సంతతికి, తన ఉనికికోసం, తన సమాజ నిరంతర పురోగవృద్ధికోసం, స్వచ్ఛందంగా తమ పూర్తి సంతృప్తితో ఈ బాధ్యతను నెరవేర్చటానికి తమనుతాము సమర్పించుకొనే ఇలాంటి కార్యకర్తలు లక్షలాది, కోట్లాది సంఖ్యలో అవసరమై ఉంటారు. వారు ఈ బాధ్యతను తీర్చుటయే కాక, ముమ్ముందు ఇలాంటి కార్యకర్తల్ని సమాజానికి అందించటానికి కూడా పునాది వేస్తారు. బృహత్తరమైన ప్రపంచమనబడే ఈ ఫ్యాక్టరీ, ఇదేవిధంగా నడువ గలుగుతుంది. ఇదేవిధంగా ముందుకు సాగగులుతుంది. ఇలా నడవటానికి, ముందుకు సాగటానికి ఇలాంటి నిరంతర సేవచేసే కార్యకర్తలు ముందుకు వచ్చి తమ తరువాత తమ స్థానాన్ని పూరించే తమకన్నా యోగ్యులైన కార్యకర్తల్ని అందిస్తూ పోతున్నారు. ఒకవేళ కొత్త కార్యకర్తల

నియామకం లేక బర్తీ ఆగిపోయి పాత కార్యకర్తలు ప్రకృతి సహజంగానే అశక్తులై తొలిగిపోతూ ఉంటే, యోగ్యులైన కార్యకర్తలు లేక కార్మికులు క్రమక్రమంగా తగ్గుతూపోతే చివరికి ఒకరోజు ఈ ప్రపంచమనబడే కర్మాగారం మూతబడక తప్పదు. దీని అందచందాలు, దీని సౌందర్యం, దీని కార్యకలా పాలు అంతెందుకు దీని ఉనికే ప్రశ్నార్థకంగా మారిపోతుంది. అందుకని సమాజ మనబడే ఈ మిషనును నడుపుతున్న ప్రతి మనిషి, ప్రతి కార్యకర్త తను బ్రతికినన్నాళ్ళు దీనిని నడుపుతూ పోవటమే కాదు, తన తరువాత ఈ కార్య భారాన్ని, ఈ మెషిన్‌ను నడపటానికి తన స్థానాన్ని పూరించటానికి యోగ్యులైన తనలాంటి కార్యకర్తల్ని అందించటం కూడా అతని అనివార్యమైన బాధ్యత అవుతుంది.

ఒకవిధంగా చూస్తే, 'వివాహ'మనేది లైంగికవాంఛను తీర్చుకునే, తృప్తి పరిచే ఏకైక మరియు సర్వాంగీకృతమైన పద్ధతి మాత్రమే కాదు, ఇదొక సామాజిక బాధ్యత కూడాను. ఇది వ్యక్తిపై సమాజానికున్న స్వాభావిక హక్కు. అందుకని వివాహం చేసుకోవటం, చేసుకోకపోవటం అనే స్వేచ్ఛ వ్యక్తికి ఎట్టి పరిస్థితుల్లోను ఇవ్వటం జరుగరాదు. ఎవరైతే సముచిత కారణం లేకుండా వివాహానికి అంగీకరించరో వారు సమాజానికి పరాన్నభుక్కులు (Parasites). ఇంకా మాట్లాడితే సమాజద్రోహులు, సమాజ దోపిడీగాండ్లుగా పరిగణింప బడాలి. ఈ భూమిపై కళ్ళు తెరిచిన ప్రతి మనిషి, భూమిపై మొదటి శ్వాసపీల్చి నప్పటి నుండి యవ్వనదశకు చేరేవరకు, సమాజం సమకూర్చిన లెక్కలేనన్ని వనరుల నుండి, వ్యవస్థలనుండి, కట్టుబాట్లనుండి, ఆచార వ్యవహారాల నుండి లాభపడుతూ వచ్చాడు. గడిచిన తరాలు కఠోర శ్రమ, ప్రయాసలకోర్చి ఏర్పరిచిన వ్యవస్థల ద్వారా అతను బ్రతికి ఉండటానికి, పెరగటానికి వృద్ధి వికాసాలు చెంది పరిపూర్ణ మానవునిగా మారటానికి లెక్కించనలవిగాని విధాలుగా లాభపడ్డాడు. ఈ మధ్యకాలంలో అతను సమాజం, దాని వ్యవస్థల నుండి తీసుకోవటం, గ్రహించటమే కాని సమాజానికి అతనేమి ఇవ్వలేదు. లోపపూరిత మైన, అసంపూర్ణమైన అతని శక్తుల్ని పరిపూర్ణం చేయటానికి,

అభివృద్ధి పరచటానికి సమాజం తన వద్దనున్న సర్వశక్తుల్ని, సర్వవనరుల్ని, సర్వ సంపదను అతనిపై ధారపోసిందెందుకు? అతను యోగ్యుడయి సమాజానికి అవసరమైన సేవలు అందిస్తాడనే ఆశతోనే కదా! కాని అతను పెరిగి పెద్దవాడై తన కోసం వ్యక్తిగత స్వేచ్ఛ మాత్రమే కోరటం కాదు, తన ఐహిక వాంఛల్ని, లైంగిక వాంఛల్ని మాత్రమే పూర్తి చేసుకుంటానని, ఆ కోరికలు తీర్చుకోవటం ద్వారా ఉత్పన్నమయ్యే ఫలితాలను, బాధ్యతల్ని మాత్రం నెరవేర్చనని మొండికేస్తే అది సమాజంపట్ల తీరని ద్రోహం కాదా? అతని జీవితంలోని ప్రతి ఘడియ అన్యాయంతో ఉంటుంది. ఆ సమాజంలో జ్ఞానమే కనుక ఉంటే అలాంటి వ్యక్తుల్ని జెంటిల్‌మన్‌గా, గౌరవప్రదమైన లేడీగా కాకుండా దోపిడీదారుగా, మోసగానిగా గుర్తించాలి. మనం కోరినా కోరకపోయినా మనకు ముందు తరాల వారు సమకూర్చిపోయిన సంపద, వనరులకు మనం వారసులమయ్యాం. అందులోనుండి అనుభవించే, మనమీ స్థితికి ఎదిగాము. సహజసిద్ధంగా మన వరకు చేరిన ఈ సంపద, ఈ వారసత్వ లక్ష్యాలను నెరవేర్చటం, నెరవేర్చక పోవటంలో మనం స్వాతంత్రుల మని ఎలా వాదించగలము? మానవ సంతతికి చెందిన ఈ సంపద లేక సంస్కృతికి వారసత్వం వహించే తరాన్ని అందించటం, అందించక పోవటం మన ఇష్టాయిష్టాలమీద ఆధారపడుందని ఎలా అనుకోగలుగు తాము? ఏవిధంగా గత తరాలు మనల్ని సంస్కరించి, సమాజానికి అందించాయో, అదేవిధంగా మన తరువాతి తరాలను సమాజానికి అందించటం అందించక పోవటం నా ఇష్టమని ఎలా చెప్పగలం?

## 3. లైంగిక విశృంఖలత్వంపై కట్టడి

వివాహం, కుటుంబ వ్యవస్థలు తప్ప ఇతర అన్నిరకాల లైంగిక సంబంధాల ద్వారాలను కఠినంగా మూసివేయక తప్పదు. ఈ ద్వారాలు మూసివేయకపోతే వివాహం, కుటుంబ వ్యవస్థల సహజ లక్ష్యాలు నెరవేరవు.

ప్రాచీన అజ్ఞానకాలపు మాదిరిగానే అధునిక అజ్ఞాన కాలంలో కూడా అనేకమంది వ్యభిచారాన్ని లేక అక్రమ సంబంధాన్ని ఒక సహజసిద్ధమైన పనిగా పేర్కొంటున్నారు. వివాహాన్ని మాత్రం సమాజం రుద్దిన కృత్రిమ కార్యంగా, అదనపు భారంగా భావిస్తున్నారు. వారి ఆలోచన ఏమిటంటే ప్రకృతి మేకకోసం మేకపోతును, ఆడ కుక్క కోసం మగకుక్కను ఎలా సృష్టించిందో అదేవిధంగా స్త్రీని పురుషుని కోసం, పురుషున్ని స్త్రీకోసం పుట్టించింది. అందుకని కోరిక కలిగినప్పడు, అవకాశం చిక్కినప్పుడు, పరస్పరం అంగీకారం కుదిరినప్పుడు పశువులు తమ లైంగిక కోరికలు ఎలా తీర్చుకుంటాయో అదేవిధంగా స్త్రీ పురుషులు ఇద్దరూ తమ లైంగిక కోరికల్ని తీర్చుకోవడం తప్పు లేదని వారి అభిప్రాయం. కాని ఇది మానవనైజానికి పూర్తిగా విరుద్ధమైన వివరణ. వీరు మానవున్ని కేవలం ఓ పశువుగా గుర్తించారు. అందుకని వీరు 'స్వాభావికమైన' అనే పదం వాడినప్పుడు వారి దృష్టిలో పశుస్వభావమే ఉంటుంది తప్ప మానవ స్వభావం ఉండదు. పైకి కనబడే ఏ లైంగిక సంబంధాన్ని వీరు స్వాభావికమైన దంటారో అది పశువుల కోసమైతే నిస్సందేహంగా స్వాభావికమైనదే. కాని మానవుని కొరకైతే ఎంతమాత్రం స్వాభావికమైనదికాదు. ఇది మానవ స్వభావానికి విరుద్ధం మాత్రమే కాదు, వాటి అంతిమ ఫలితాల దృష్ట్యా మానవ స్వభావంలో కొద్దిపాటిగానున్న పశుస్వభావానికి కూడా విరుద్ధంగా మారిపోతుంది. మానవుని లోని సహజసిద్ధమైన మానవత్వం, కొద్దిపాటి పశుత్వం విడదీయదగిన రెండూ వేర్వేరుగా అంశాలు కావు. వాస్తవం ఏమిటంటే ఒకే అస్తిత్వంలో ఈ రెండూ కలిసి ఒక వ్యక్తిత్వాన్ని ఉనికిలోకి తెస్తాయి. ఈ రెండిటి లక్ష్యాలు పరస్పరం ఎలా పెనవేసుకుపోతాయంటే, ఒకదాని లక్ష్యాన్ని తృణీకరిస్తే వేరొకదానిలక్ష్యం కూడా దానంతటదే నిర్వీర్యమైపోతుంది.

అక్రమ సంబంధంలో మానవుడు తనలోని పశువాంఛను లేక పాశవిక స్వభావ లక్ష్యాన్ని నెరవేరుస్తున్నానని భావిస్తాడు. వివాహ బంధం ద్వారానైనా

లేక వివాహేతర బంధం ద్వారానైనా, ఉత్పత్తి, జాతి ఉనికి అనే లక్ష్యం కేవలం లైంగిక సంబంధం ద్వారానే నెరవేరుతుంది. అయితే ఇంతకుముందు, పైన మేము వివరించిన విషయాలను మరోసారి మననం చేసుకోండి.

వ్యభిచారం మానవుని స్వాభావిక ఉద్దేశాన్ని ఏవిధంగా నష్టపరుస్తుందో, అతని పాశవిక స్వాభావిక ఉద్దేశాన్ని కూడా నష్టపరుస్తుంది. మానవ స్వభావం లైంగిక సంబంధంలో నిలకడ, స్థిరత్వాన్ని కోరుతుంది. తద్వారా తల్లిదండ్రు లిద్దరూ కలిసి శిశువును పోషించాలని ఒక సుదీర్ఘకాలం వరకు పురుషుడు పిల్లలవానికే కాదు, వాని తల్లికి కూడా పోషకునిగా ఉండాలని కోరుతుంది. ఒకవేళ ఈ శిశువు తన కుమారుడేనని పురుషునికి గట్టి నమ్మకం ఏర్పడకపోతే అతను తన సంపదను, కష్టార్జితాన్ని ఆ బాలుని కోసం ఎందుకు వెచ్చిస్తాడు? ఆ తరువాత తన వారసునిగా ఎందుకంగీకరిస్తాడు? అదేవిధంగా ఒక స్త్రీకి తను గర్భం దాల్చిన తరువాత తనను, తనకు పుట్టబోయే బిడ్డను ఈ పురుషుడు సాకుతాడని గట్టి నమ్మకం కలగనంత వరకు ఆ పురుషుని వద్దకు ఎందుకు వెళుతుంది? ఒకవేళ వెళ్ళినా, అతని ద్వారా గర్భమెందుకు దాల్చుతుంది? నవమాసాల బరువును ఎందుకు మోస్తుంది? ఒక శిశువు పోషణలో అతన్ని విద్యాసంస్కారాల రీత్యా తీర్చిదిద్దటంలో తల్లిదండ్రులిద్దరి సహకారం లేకుండా ఆ శిశువు సంస్కారపరంగానే కాక, మానసిక, నైతిక, ఆర్థిక పరిస్థితి దృష్ట్యా కూడా సమాజం సంతోషంగా స్వీకరించేస్థాయికి ఎదగలేడు. యోగ్యుడైన కార్యకర్తగా సమాజానికి పనికిరాడు. ఇవన్నీ కూడా మానవనైజం కోరే లక్ష్యాలు. ఈ లక్ష్యాలను గమనించకుండా కళ్ళు మూసుకొని కేవలం పశువుల్లాగా స్త్రీపురుషులు తాత్కాలిక సంబంధం ఏర్పరుచుకుంటే అదికూడా పాశవిక స్వభావం (అనగా పుట్టుట, జాతి పరంపర) లక్ష్యాలను పాడు చేస్తుంది. ఎందుకంటే ఈ క్షణిక ఉద్రేక సమయంలో జననం, జాతి పరంపర అనే లక్ష్యాలపై వారి దృష్టి ఉండదు. ఆ సమయంలో వారి మధ్య లైంగిక సంబంధం కేవలం

లైంగికవాంఛ తీర్చుకోవటం, కామాగ్ని చల్లార్చుకొని తృప్తిపడటం వరకే పరిమితమై ఉంటుంది. ఇది ప్రకృతి లక్ష్యాలకు వ్యతిరేకం.

ఆధునిక అజ్ఞాన ధ్వజవాహకులకు పై అంశంలోనున్న బలహీనత తెలియనిది కాదు. అయితే ఈ బలహీనతను కప్పిపుచ్చుకోవటానికి వారు ఇంకొక తర్కాన్ని జోడిస్తారు. సమాజంలోని ఇద్దరు వ్యక్తులు పరస్పరం కలుసుకొని కొన్ని క్షణాలు సుఖసంతోషాల్లో గడిపితే సమాజానికి వచ్చే నష్టం ఏమిటని; ఆ ఇద్దరిలో ఒకరిపై బలాత్కారం లేక మోసం జరిగితే తప్ప సామాజిక సమస్య ఎందుకు ఉత్పన్నమవుతుందని వారు వాదిస్తారు. ఇవేమీ లేనప్పుడు ఇద్దరు వ్యక్తుల మధ్య లైంగిక తృప్తి కోసం జరిగే కార్యకలాపంలో జోక్యం చేసుకోవటానికి సమాజానికి ఉన్న హక్కేమిటని, ఇలాంటి వ్యక్తిగత, ప్రైవేట్ వ్యవహారాల్లో కూడా సమాజం జోక్యం చేసుకుంటుంటే ఇక ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛకు అర్థం లేకుండా పోతుందని వారు అంటారు.

వ్యక్తిగత స్వేచ్ఛ అనే సిద్ధాంతం పందొమ్మిదవ శతాబ్దంలో ఉనికిలోకి వచ్చిన అజ్ఞానభావనల్లో ఒకటి. జ్ఞానం, పరిశోధనలకు సంబంధించిన మొదటి కిరణం ఉదయించగానే ఇలాంటి సిద్ధాంతపు చీకట్లు పటాపంచలైపోతాయి. ఏ కొంచెం ఆలోచించినా సామూహిక జీవితంలో ఈ వ్యక్తిగత స్వేచ్ఛకు ఎలాంటి స్థానం లేదని వెంటనే తెలిసిపోతుంది. మానవ సమూహంలోని ప్రతి వ్యక్తి జీవితం ఇతర అనేకమంది వ్యక్తులతో ముడిపడి ఉంటుంది. ఒక వ్యక్తి ఇతరులపై ప్రభావం వేయుటమే కాకుండా, అతను కూడా ఇతరులతో ప్రభావితమవుతాడు. ఈ సంబంధాల్లో ఒక మనిషి వాక్క్రియల ప్రభావం కేవలం తనవరకే పరిమితమై ఉండజాలదు. అందుకని ఒక వ్యక్తి ద్వారా జరిగే ఎలాంటి పనైనా అది అతని వరకే పరిమితమైనదని, వ్యక్తిగతమైనదని ఎంతమాత్రం చెప్పలేము. ఏదో ఒకరూపంలో ఏదో ఒక కారణంతో సమాజంపై ప్రభావం వేయని వ్యక్తిగత చర్య గురించి మనం ఆలోచించనైనా ఆలోచించ లేము. చివరికి మన మనోమస్తిష్కాల్లో దాగి ఉన్న భావనలు సైతం మన

ఉనికిపై, ఆ తర్వాత మన చుట్టుపక్కల ఉండే ప్రజలపై ప్రభావం వేయకుండా ఉండజాలవు. ఇటువంటి పరిస్థితుల్లో ఒక వ్యక్తి తనలోని ఒక శక్తిని వినియో గించినప్పుడు, అది తన వ్యక్తిత్వంపై తప్ప వేరెవరిపై ప్రభావం వేయజాలదని, కాబట్టి తన వ్యక్తిగత స్వేచ్ఛను హరించడానికి సమాజానికి ఎలాంటి అధికారం ఉండరాదని వాదించగలడా? ఒకవేళ నాకు నా ఇష్టం వచ్చిన రీతిలో కర్ర తీసుకొని ఇష్టం వచ్చిన చోట కొట్టటానికి, నా ఇష్టం వచ్చిన ఇంట్లో జొరబడటానికి, నా బండిని నా ఇష్టం వచ్చిన రీతిలో నడపటానికి, నా ఇంట్లో నా ఇష్టం వచ్చినంత మలినాన్ని కూడబెట్టుకోవటానికి, ఇంకా ఇలాంటివే అనేక వ్యక్తిగత వ్యవహారాలు జరుపుకోవడానికి ఎలాంటి ఆంక్షలు, సామూహిక కట్టుబాట్లు ఉండరాదని ఎవరైనా అనగలరా? ఎవరూ అనలేరు. అలాంటప్పుడు ఒక్క లైంగికవాంఛనే ఇష్టమొచ్చినవారితో, ఇష్టమొచ్చిన విధంగా తీర్చుకునే హక్కు ఎందుకు ఉండకూడదని వాదించడంలో అర్థముందా?

ఒక స్త్రీ, ఒక పురుషుడు అందరికీ దూరంగా ఒక గుప్త ప్రదేశంలో పరస్పర అంగీకారంతో కలిసి సుఖసంతోషాన్ని అనుభవిస్తే దాని ప్రభావం సమాజంపై ఏమాత్రం పడదనటం కేవలం పసిపిల్లల వాదన మాత్రమేనని చెప్పాలి. దీనిప్రభావం, వారు సంబంధం కలిగి ఉన్న సమాజంపైనేకాదు, సర్వ మానవత్వంపై దాని ప్రభావం పడుతుంది. ఒక వ్యక్తి ఏకాంతంలో ఈ విధంగా అక్రమచర్యకు పాల్పడ్డాడంటే, అతను మానవజన్మకు కారణభూతమైన తన వీర్యశక్తిని ఫలితంలేని, క్షణికమైన ఆనందోద్రేకాల్లో నష్టపరచటమే కాదు, అతను సామూహిక జీవితంలో అరాచకాన్ని లేపుతూ, మానవజాతి హక్కులను కాలరాస్తూ, సమాజంలో అనేక నైతిక, భౌతిక, సామాజిక రుగ్మతల్ని రేకెత్తించటంలో నిమగ్నమై ఉన్నాడని అర్థం. సమాజంలోని ఒక సభ్యునిగా అతను అనేక సామూహిక సంస్థల ద్వారా లబ్ధి పొంది, తన స్వార్థంకోసం వాటి మనుగడలో తనవంతు సహకారం అందించటానికి నిరాకరిస్తూ వాటి ఉనికికే ఎసరు పెడుతున్నాడు. మునిసిపాలిటీ మొదలుకొని ఒక రాజ్యం వరకు,

పాఠశాల మొదలుకొని సైన్యం వరకు, ఫ్యాక్టరీలు మొదలుకొని జ్ఞానపరిశోధనా సంస్థలవరకు- వీటన్నిటిని సమాజం ఏ ఆశతో, ఏ లక్ష్యంతో నెలకొల్పింది? వీటిద్వారా లబ్ధి పొందిన ప్రతి వ్యక్తి వాటి ఉనికిని కాపాడటంలో, వాటి పురోభివృద్ధిలో తనవంతు సహాయసహకారాలు అందజేస్తాడనే నమ్మకంతోనే కదా! కాని ఈ విశ్వాసఘాతకుడు చేసిందేమిటి? జననం, సంతతి పురోగమనం, శిశువు సంరక్షణ వంటి సామాజిక విషయాలకు అసలు తావే లేకుండా, వాటి గురించి కనీసం ఆలోచన కూడా లేకుండా విలువైన తన లైంగిక శక్తిని దుర్వినియోగం చేస్తున్నాడు. అంటే ఒక్క వేటుతో తన పరిధిలోని ఈ సంస్థలన్నింటిని నేలమట్టం చేస్తున్నాడు. మానవునిగా, ఒక సభ్యునిగా సమాజంలో చేరి, సమాజం ద్వారా లబ్ధి పొంది, తన సహాయ సహకారాలు అందజేసే సమయానికి ఈ సామూహిక ఒప్పందాన్నే ఉల్లంఘించడానికి ఒడిగట్టాడు. తనవంతు బాధ్యతాభారాన్ని మోయటానికి బదులు, ఆ భారాన్ని ఇతరులపై పడేశాడు. ఇలాంటి మనిషిని నీతిమంతుడు, నిజాయితీపరుడని అనగలమా? ఎంతమాత్రం అనలేము. అతనొక దొంగ, దోపిడీదారు, కపటి, మోసగాడు. అతనిపై దయ చూపటమంటే సర్వమానవాళిపై దౌర్జన్యం చేయడమే అవుతుంది.

సామూహిక జీవితంలో వ్యక్తి స్థానమేమిటనే విషయాన్ని మనం క్షుణ్ణంగా పరిశీలించవలసి ఉంది. ఒక్కొక్క మనిషికి ప్రసాదించబడిన మానసిక, శారీరక శక్తిసామర్థ్యాలు కేవలం వ్యక్తిగత వ్యవహారాల కోసం ఇవ్వబడలేదు. అవి సర్వమానవాళికి సంబంధించిన అమానతుగా అతని వద్ద భద్రపరచబడ్డాయి. మనలోని ఒక్కొక్క శక్తికి సంబంధించి సర్వమానవాళికి మనం జవాబు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. మనం మన ప్రాణాన్ని లేక మనలోని ఏదో ఒక శక్తిని నష్టపరిస్తే లేక దుర్వినియోగం చేస్తే అది మన ఆత్మవంచన మాత్రమే అనుకుంటే దాని అర్థం మనకు చెందిన వస్తువుని మనం నష్టపరుచుకున్నామని ఎంతమాత్రం కాదు. సర్వమానవాళికి చెందిన ఏ

అమానతు మన వద్ద ఉంచబడిందో దాన్ని మనం నష్టపరచామన్న మాట. మన ఈ చర్యవల్ల మానవజాతి అంతటికి ద్రోహం చేసినట్లవుతుంది. ఎందరెందరు ఎన్నెన్ని కష్టనష్టాలకు ఓర్చి పని చేస్తేనే కదా మనమీ ప్రపంచం లోకి వచ్చాము. ఆ తర్వాత రాజ్యం, దాని వ్యవస్థ మన జీవితానికి రక్షణ కల్పించాయి. వైద్య ఆరోగ్యశాఖలు మన ఆరోగ్యాన్ని పరిరక్షించాయి. లక్షలాది ప్రజలు మనకు అవసరమైన జీవితావసరాలను సమకూర్చారు. సమాజం నెలకొల్పిన అనేకానేక సంస్థలు మనలోని శక్తుల్ని సంస్కరించాయి. వీరందరి కృషి ప్రయాసల ఫలితంగానే ఇప్పుడు మన మీ స్థితిలో కనబడుతున్నాము. మరి పైవారందరి రుణం తీర్చుకొనే పద్ధతి ఇదేనా? ఈ ప్రాణం దానిలోని శక్తులన్నింటిని తీర్చిదిద్దటంలో బయటివారు ఇంత గణనీయమైన పాత్ర వహించినప్పుడు మన ప్రాణాన్ని, శక్తిసామర్థ్యాలను, మన ఇష్టానుసారం నష్టపరుచుకుంటాం అనడం న్యాయమవుతుందా? వీటిని మన ఇష్టం వచ్చిన మార్గంలో వినియోగిస్తామనటం సమంజసమవుతుందా? ఏమాత్రం కాదు. అందువల్లనే ఆత్మహత్యను సమాజం నేరంగా పరిగణించింది. ఈ కారణంగానే హస్తప్రయోగం ద్వారా వీర్యాన్ని నష్టపరిచేవాడ్ని విశ్వవిఖ్యాత తత్వజ్ఞాని 'ధూషితుని'గా పేర్కొన్నాడు. స్వలింగ సంపర్కాన్ని ఈ కారణంగానే అత్యంత ఘోరమైన నేరంగా పరిగణించారు. అందుకనే వ్యభిచారం కూడా వ్యక్తిగత మనోల్లాసం, శారీరక తృప్తికోసం మాత్రమే కాదు, సర్వమానవ సమాజానికి తీరని ద్రోహం, క్షమించరాని నేరం కూడా అవుతుంది.

ఒక్కసారి వ్యభిచారథం, దాని పరిణామాలను గురించి ప్రశాంతంగా ఆలోచించండి. మన సామూహిక జీవితంపై, సమాజంపై అదెన్ని విధాల దౌర్జన్యాలతో ముడిపడి ఉందో పరిశీలించండి.

1. ప్రథమంగా వ్యభిచారి తనను సుఖరోగాలకు గురిచేస్తాడు. తద్వారా తన శారీరక శక్తుల కార్యాచరణలో లోపాన్ని సృష్టించుకోవటమే కాదు, సమాజానికి, సంతతికి తీరని నష్టం కూడా కలిగిస్తాడు. సెగరోగం లేక పాండు రోగాన్ని గురించి ఏ వైద్యున్నైనా అడిగి చూడండి. మర్మాంగంలో ఏర్పడిన

పుండు సామాన్యంగా నయం కానిది. ఒక గొప్ప డాక్టర్ లోకోక్తి ఏమిటంటే "ఒకసారి సోకిన సెగరోగము శాశ్వతమైన రోగము." దీనివల్ల కాలేయము, మూత్రకోశము మొదలగు అవయవాలు కూడా కొన్ని సందర్భాల్లో దెబ్బ తింటాయి. ఇది కీళ్ళనొప్పులు, ఇతర రోగాలకు కారణభూతమవుతుంది. వ్యభిచారం వల్ల శాశ్వతంగా గొడ్డుతనం ఏర్పడే ప్రమాదముంది. అంతేకాక ఇది ఇతరులకు సోకే ప్రమాదమున్న రోగం కూడాను. మరికొన్ని సుఖరోగాల ప్రభావాలమయితే ఇంకా తీవ్రంగా, భయంకరంగా ఉంటాయి. అవి రోగి నుండి ఇతరులకు కూడా పాకిపోతాయి. ఇలా ఈ దుర్మార్గుడి మూలంగా అతని సంతానం, ఆ సంతానపు సంతానం కూడా, చేయని నేరానికి శిక్ష అనుభవించ వలసివస్తుంది. అంధులు, మూగ, చెవిటి, మతిలేని పిల్లల జననం- దౌర్జన్యకారుడైన తండ్రి, తన జీవితపు మధురానుభూతులు అనుకొని గడిపిన ఆ కొద్దిక్షణాల దుష్ఫలితాలే.

2. సుఖరోగాలు ప్రతి వ్యభిచారికి సోకడం తప్పనిసరి కాకపోయినా ఈ చర్యతో అనివార్య సంబంధమున్న నైతిక బలహీనతల నుండి మాత్రం ఎవరూ తప్పించుకోలేరు. అశ్లీలం, మోసం, కాపట్యం, అబద్ధం, అవినీతి, స్వార్థం, భోగలాలస, నిగ్రహలోపం, ఆలోచనల్లో పోకిరితనం, నడవడికల్లో చంచలత్వం, ముఖం చాటేసుకోవటం, విశ్వాసఘాతుకం- ఇవన్నీ వ్యభిచారానికి సంబంధించిన నైతిక రుగ్మతలు. ఇవి వ్యభిచారి మనోమస్తిష్కాలపై ప్రభావం వేయకుండా ఉండజాలవు. ఏ వ్యక్తిలో ఈ దుష్టగుణాలుచోటుచేసుకుంటాయో అవి కేవలం లైంగిక విషయాల వరకే పరిమితమై ఉండవు. జీవితంలోని ప్రతిరంగంలో ఆ వ్యక్తి **తన** సంఘానికి ఈ గుణాలనే, వాటి ప్రభావాలనే సమర్పించుకుంటాడు. ఒకవేళ పైన పేర్కొన్న గుణాలు సమాజంలోని అత్యధిక మందికి కనుక సోకినట్లయితే అవి కళ, సాహిత్యం, వినోదక్రీడలు, పరిశ్రమలు, కళలు, సంస్కృతి ఆర్థికత్వము, రాజకీయము, న్యాయ వ్యవస్థలు, సైనిక సేవలు, రాజ్యవ్యవహారాలు- ఒక్కటేమిటి, సర్వరంగాలను నిర్వీర్యం చేసి పడేస్తాయి. ప్రత్యేకించి ప్రజాస్వామ్య వ్యవస్థలోనైతే.......

3. వ్యభిచారాన్ని అనుమతించటమంటే సమాజంలో వేశ్యవృత్తి సాగకుండా ఉండదు. ఒక వ్యక్తి, యువకుడైన పురుషునికి 'వినోదం' హక్కు ఉండాలని చెప్తున్నాడంటే దాని అర్థం సామూహిక జీవితంలో, సాంఘిక జీవితంలో అత్యంత నీచమైన పడుపువృత్తిని అవలంబించే స్త్రీల వర్గం ఒకటి ఉండితీరాలన్న మాట. అయితే ఈ స్త్రీవర్గం ఎక్కడినుండి ఊడిపడుతుంది? ఈ సమాజం నుండే రావాలి కదా! సమాజంలోని ఎవరో ఒక పురుషుని బిడ్డనో, చెల్లినో కాకతప్పదు. ఒక ఇంటికి యజమానురాలు, ఒక కుటుంబానికి స్థాపకురాలు అనేకమంది పిల్లలకి సంరక్షకురాలు కాగలిగిన ఇలాంటి లక్షలాది స్త్రీలనే ఈడ్చుకువచ్చి ఈ వేశ్యబజారులో కూర్చోబెట్టాలి కదా! మునిసిపాలిటి మూత్రశాలల్లో ఇష్టం వచ్చినవారు అవసరమనుకున్నప్పుడల్లా వెళ్ళినట్లు తమ కామవాంఛను తీర్చుకునే దుష్టపురుషుల అవసరాలు తీర్చే కేంద్రాలుగా మార్చటమే కదా! దీనిద్వారా స్త్రీ తనలో ఉన్న సుగుణాలన్నిటినీ కోల్పోక తప్పదు. వారికి వయ్యారం, కుటిల మనస్తత్వం నేర్పటం జరుగుతుంది. తమ ప్రేమ, హృదయం, శరీరం, అందచందాలు సర్వస్వాన్ని ఒక్కొక్క గంటకు ఒక్కొక్క వినియోగదారునికి అమ్ముకోవటానికి తగిన విధంగా వారిని మార్చటం జరుగుతుంది. ఈవిధంగా స్త్రీ ప్రయోజనకరమైన కుటుంబ వ్యవస్థ నిర్వాహకురాలు కావడానికి బదులు జీవితాంతం పరపురుషుల కామవాంఛను తీర్చే కీలుబొమ్మలుగా మార్చబడుతుంది.

4. వ్యభిచారాన్ని అనుమతిస్తే అది తప్పకుండా సామాజిక నియమమైన వివాహవ్యవస్థను నష్టపరిచి తీరుతుంది. ఇంకా చెప్పాలంటే దీని అంతిమ పర్యవసానంగా వివాహవ్యవస్థ పూర్తిగా నశించిపోయి కేవలం వ్యభిచారమే విశ్వరూపం దాల్చి సమాజంలో రాజ్యమేలుతుంది. వ్యభిచారం పట్ల మోజు కలిగిన స్త్రీ పురుషుల్లో నిజమైన దాంపత్య జీవితం గడిపే యోగ్యతే ఉండదు. వ్యభిచార వ్యసనం వల్ల ఉత్పన్నమయ్యే చెడుదృష్టి, చెడు తలంపు, చంచలత్వం, పోకిరితనం లాంటి దుర్గుణాలు, తద్వారా వారి ఆలోచనల్లో అనిశ్చలత, భోగలాలస, నిగ్రహలోపం లాంటి బలహీనతలు చోటు చేసు

కుంటాయి. ఒకవేళ ఇలాంటి వ్యక్తుల జీవితం దాంపత్య జీవితంతో ముడిపడి పోయినా దంపతుల మధ్య దాంపత్య జీవితానికి అవసరమైన పరస్పర ప్రేమ, అభిమానం, విశ్వాసము, సహకారం, సానుభూతులు చోటు చేసుకోలేవు. ఇవి ఉంటేనే మంచి భావితరం, ఆనందోత్సాహాలు వెల్లివెరిసే కుటుంబం ఉనికిలోకి వస్తాయి. ఇంకొక విషయం, వ్యభిచారానికి అనువైన వాతావరణం నెలకొనే చోటున లేక సమాజంలో సమాజ బాధ్యతలతో కూడిన వివాహ వ్యవస్థ లేక కుటుంబ వ్యవస్థ మనగలగజాలదు. ఒక వ్యక్తికి ఎలాంటి బాధ్యతలు లేకుండానే తన కామవాంఛలు తీర్చుకునే అవకాశమున్నప్పుడు అతడెందుకు వివాహం చేసుకొని తన భుజాలపై బాధ్యతల బరువును వేసుకుంటాడు? ఈ కారణంగానే పాశ్చాత్యదేశాల్లో ప్రత్యేకించి యూరోపియన్ సమాజాల్లో వివాహ వ్యవస్థ కుంటుపడిపోయింది. కుటుంబవ్యవస్థ చిన్నాభిన్నమై పోయింది.

5. వ్యభిచారానికి అనుమతించటం, ఆచారమివ్వటం మూలంగా కేవలం సాంఘిక పతనమొక్కటే కాదు, మానవజాతి ఉనికికే ప్రమాద మేర్పడుతుంది. ఈ విషయాన్ని పైన రుజువు పరిచాము. విచ్చలవిడి లైంగిక సంబంధాల్లో స్త్రీపురుషులిద్దరికి కూడా సంతానోత్పత్తి లేక మానవజాతి మనుగడ గురించిన కోరిక ఉండదు, ఉండజాలదు కూడా.

6. వ్యభిచారం వల్ల సమాజానికి అసలు శిశువులే లభించరు. లభించినా వారు అక్రమ సంతానంగానే లభిస్తారు. వంశపరంగా అక్రమ, సక్రమ అనేది కేవలం ఒక మానసిక భావన తప్ప ఇంకేమి కాదని కొందరు అజ్ఞానులు భావిస్తారు. నిజానికి అనేకానేక కారణాల మూలంగా అక్రమ సంతానానికి జన్మనివ్వటం అంటే ఆ శిశువుపై, సర్వమానవ సమాజంపై ఒక ఘోరమైన అన్యాయం, దౌర్జన్యం చేయడమే. తల్లిదండ్రులిద్దరూ కేవలం పాశవిక ఉద్రేకంలో మునిగి ఉన్న సమయంలోనే ఈ శిశువుకు తల్లి గర్భంలో అంకురార్పణ జరుగుతుందనేది మొదటి విషయం. వివాహబంధంతో ముడిపడి ఉన్న ఒక జంటలో సంభోగ సమయంలో ఉండేటటువంటి పవిత్ర మానవీయ విలువలు ఈ అక్రమ లైంగిక సంబంధం ఏర్పర్చుకున్న జంటలో

ఎట్టి పరిస్థితుల్లోను ఉత్పన్నం కాజాలవు. వారిని కేవలం పాశవిక ఉద్రేకం మాత్రమే కలిపేస్తుంది. అందుకని ఆ సమయంలో వారిలోని మానవీయ ప్రత్యేకతలన్నీ పటాపంచలైపోతాయి. తత్ఫలితంగా అక్రమంగా జన్మించిన ఆ శిశువు తన తల్లిదండ్రుల పాశవిక వారసత్వానికే అర్హుడవుతాడు. ఇక ప్రపంచం లోకి వచ్చిన ఆ శిశువును స్వాగతించటానికి తల్లిగాని, తండ్రిగాని సిద్ధంగా ఉండరు. ఎందుకంటే అతనొక కోరబడిన, అభిలషించిన, ఎదురు చూస్తున్న ఉనికికాదు. అనాలోచితంగా, అయిష్టంగా, గత్యంతరంలేక మెడలో వచ్చిపడిన పాములాంటివాడు. సాధారణంగా ఇలాంటి పిల్లలకు తండ్రి ప్రేమకాని అతని వనరులు కాని లభించవు. తల్లి ఏకపక్ష ప్రేమ, రక్షణే అతనికి దిక్కు. ఆ ప్రేమలో కూడా విసుగు, అయిష్టత ప్రస్ఫుటంగా కనబడుతాయి. అతను అవ్వ, తాతయ్యల ప్రేమ వాత్సల్యాలకు కూడా నోచుకోలేడు. కుటుంబ సంరక్షణ, ప్రేమ అంటే ఏమిటో అతనెరుగడు. అందుకని అతనొక అసంపూర్ణ వ్యక్తిగా, లోపభూయిష్టమైన వ్యక్తిత్వంగానే ఎదుగుతాడు. అతనికి సరియైన శిక్షణ దొరకనందువలన అతని క్యారక్టర్ పరిపూర్ణం కాజాలదు. అతనిలోని యోగ్యతలు వికసించవు. సమాజంలో తగిన విధంగా పురోగమించ టానికి, సముచిత స్థానం పొందటానికి కావలసిన ఒనరులు అతనికి లభ్యంకావు. అందువల్ల అతను లోపభూయిష్టంగా, అనాథగా, అపరిచితునిగా, పీడితునిగా, దూషితునిగా సంఘంలో అడుగుపెడతాడు.

విశృంఖల లైంగిక సంబంధాల ధ్వజవాహకులు దీన్ని గురించి వితండ వాదం చేస్తూ ఇలాంటి పిల్లల పోషణ, విద్యాబుద్ధుల కోసం ఒక జాతీయ వ్యవస్థ ఉండాలని, తల్లిదండ్రులు తమ ఇష్టానుసారం కనిన పిల్లల్ని జాతి పెంచి పోషించి, సామాజిక సేవకోసం తర్ఫీదునివ్వాలని అంటారు. స్త్రీ పురుషు లకు లైంగిక స్వాతంత్ర్యం, వ్యక్తిగత స్వేచ్ఛ ఉండి, వారు వైవాహిక జీవితంలో బందింపబడకుండానే తమ లైంగిక కోరికలు తీర్చుకుంటూ తత్ఫలితంగా జన్మించిన శిశువులకు ఈవిధంగా శిక్షణ ఇస్తే మానవ సంతతీ పెరుగుతుంది; దాని శిక్షణా పూర్తి అవుతుందని వారి భావన. అయితే విచిత్రమైన విషయం

ఏమిటంటే ఇటువంటి వారికి ప్రస్తుత తరం వ్యక్తిగత స్వాతంత్రమైతే ఇంతగా ప్రీతిపాత్రమైనది, కాని రాబోయే తరానికి వారు వ్యక్తిగత పురోగవృద్ధికి, వ్యక్తిత్వ వికాసానికి ఎలాంటి అవకాశం లేని జాతీయ వ్యవస్థ, ప్రభుత్వ పోషణ, శిక్షణా వ్యవస్థలను కోరుతున్నారు. లక్షలాది పిల్లలకు ఏకకాలంలో ఒకేరీతిలో, ఒకే ప్రణాళిక ప్రకారం ఒకే పద్ధతిలో పెంచే ఈ వ్యవస్థలో పిల్లల వ్యక్తిగత గుర్తింపు, ప్రత్యేకత, వ్యక్తిత్వ వికాసం ఎలా సాధ్యమవుతుంది. అలాంటి వ్యవస్థలో సాధ్యమైన మేరకు కృత్రిమ ఏకత్వం, సమానత్వాలైతే కనబడతాయి. కాని ఒక ఫ్యాక్టరీ నుండి ఉత్పాదక వస్తువులు ఒకే మూసలో, ఒకే పోలికతో రూపుదిద్దు కొని బయటకు వచ్చినట్లు ఈ వ్యవస్థ నుండి కూడా పిల్లలు ఒకే వ్యక్తిత్వంతో, ఒకే మనస్తత్వంతో బయటికి వస్తారు. కాస్త ఆలోచించండి. మానవుని గురించి ఈ మూర్ఖుల ఆలోచనలు ఎంత అల్పంగా, ఎంత నీచంగా ఉన్నాయో ఊహించండి. బాటా చెప్పుల్లాగా వీరు మానవుల్ని తయారు చేయదలిచారు. పౌల్ట్రి ఫారంలోని కోడిపిల్లలలాగా, మానవ శిశువులకు దాణా ఇస్తూ మానవుడై నందుకు విద్యాశిక్షణ ఇప్పిస్తారట. అదీ జాతీయ స్థాయిలో ప్రభుత్వ పరంగా నట. మానవ శిశువులను వీరు బాటా కంపెనీ బూట్లతో, పౌల్ట్రీఫారం కోడి పిల్లలతో సమానమను కుంటున్నారు. తరతరాలుగా యుగయుగాలుగా ఎందరెందరో ప్రవక్తలు, ఋషులు, మునులు, తత్వవేత్తలు పరిచయం చేసి, సమయోచితంగా దాన్ని సంస్కరిస్తూ ప్రయోగపూర్వకంగా సరి అనిపించుకున్న వివాహ వ్యవస్థను, కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేసి, మానవజాతికి ఈ 'మహా సంస్కర్తలు' అందించబోయే పరిష్కారాన్ని, ప్రతిఫలాన్ని చూడండి. ఇదంతా దేనికోసం? విచ్చలవిడిగా లైంగికవాంఛల్ని తీర్చుకోవటానికి అడ్డంకి ఉండకూడదనే క్షుద్రకోరికతో ఎంతటి మహోన్నత వ్యవస్థను నేలకూల్చాలని చూస్తున్నారు ఈ కామపిశాచాలు! అయితే ఒక మానవ శిశువును తీర్చిదిద్దటం ఒక సున్నితమైన కళ అనేది వారికి తెలియదు. అది కుటుంబం అనే చిరు కర్మాగారంలోనే, ఆర్ట్ గ్యాలరీలోనే సాధ్యపడుతుంది. ఈ ఆర్ట్‌కు ఎంతో శ్రమ, ఓపిక అవసరం. ఒక కళాకారుడు చిత్రంలోని ఒక్కొక్క రంగుపై ఏవిధంగానైతే

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాడో ఒక వ్యక్తిత్వాన్ని రూపొందిచటంలో అనేక అంశాలపై, అనేక కోణాలతో పరికించి సంస్కరించవలసి ఉంటుంది. కూలీకొచ్చిన కార్మికులు ఈ ప్రత్యేకతను ఈ సున్నిత మనస్తత్వాన్ని ఎలా సంతరించుకోగలరు?

అదీగాక జాతీయ విద్యాసంస్కారాల ఈ వ్యవస్థలో పనిచేయటానికి, సమాజం తరపున ఈ పిల్లల పోషణా భారాన్ని ఎత్తుకోవటానికి యోగ్యులైన కార్యకర్తలు అవసరమై ఉంటారు. అయితే ఈ పనికోసం తమ ఐహిక కోరికలను నియంత్రించగలిగే, నైతికంగా సంయమనం పాటించే కార్యకర్తలే యోగ్యులవుతారు. వారిలోనే ఈ గుణాలు లేకపోతే వారు పిల్లల్లో ఈ నైతిక నియమాలను, సంయమనాన్ని ఎలా పెంపొందించగలుగుతారు. ఇక్కడో ప్రశ్న జనిస్తుంది. ఇటువంటి కార్యకర్తల్ని మీరెక్కడి నుండి తీసుకువస్తారు? స్త్రీపురుషులను తమ కోరికలు తీర్చుకోవటానికి స్వేచ్ఛగా ఉంచాలనే కదా మీరు జాతీయ విద్యాసంస్కారాల వ్యవస్థను ఏర్పాటు చేయదలిచింది. ఇక సమాజంలో నైతిక సంమయనం, కోరికలపై నియంత్రణకు అవకాశం లేకుండానే చేసేశారే, ఇలాంటి సొసైటీలో మీకు పైగుణాలు కలిగిన కార్యకర్తలు ఎలా లభ్యమవుతారు. ఇష్టానుసారం తమ కోరికల్ని తీర్చుకోవటమే ధ్యేయంగా ఉన్న ఇలాంటి సొసైటీలో సంయమనాన్ని, నిగ్రహాన్ని జీర్ణించుకొని ఆదర్శ ప్రాయంగా నిలిచే నాథుడెవ్వడు?

7. వ్యభిచారం లేక అక్రమ సంబంధం ద్వారా స్వార్థపరుడైన ఒక వ్యక్తి ఏ స్త్రీనైతే తల్లిగా చేసేస్తాడో, ఆ స్త్రీ జీవితం శాశ్వతంగా నాశనమైపోతుంది. సాంఘికంగా అవమానం, అవహేళన, చీదరింపు, అసూయద్వేషాలే కాక అనేకానేక కష్టాల ఊబిలో ఆమె కూరుకుపోతుంది. బ్రతికున్నంత కాలం ఆ ఊబిలో నుండి ఆమె బయటపడజాలదు. ఆధునిక నైతిక సూత్రాల్లో ఈ సమస్యకు కనుగొన్న పరిష్కారమేమిటంటే వివాహం ద్వారాగాని, వివాహేతర

సంబంధం ద్వారాగాని, మాతృత్వం దాల్చిన స్త్రీలందరికి సమాన ప్రతిపత్తిని కలుగజేయటం.

మాతృత్వం అనేది గౌరవించదగ్గ స్థానంగనక ఒక బాలిక అమాయకత్వం వల్లనో, అజాగ్రత్తవల్లనో తల్లి అయ్యే బాధ్యతను స్వీకరించింది. కనుక సమాజంలో ఆమెను అవమానపరచటమంటే ఆమెపై దౌర్జన్యం చేయడమే నంటూ వీరు సమర్థిస్తున్నారు.

అయితే మొదటి విషయం- ఈ పరిష్కారం వ్యభిచారిణులకు ఎన్ని విధాల అనుకూలమైనప్పటికి, సామూహిక రూపంలో మాత్రం సమాజానికి ఇది కష్టాల్నే తెచ్చిపెడుతుంది. సమాజం సహజంగానే అక్రమ సంతానం కన్న తల్లిని నీచంగానే, ద్వేషంగానే చూస్తుంది. అయితే ఈ నీచ, ద్వేష చూపు, ఈ ప్రవర్తన **సమాజం**లోని ఇతర **వ్యక్తుల్ని** ఇలాంటి పాపం **నుండి ఆ**పటానికి, బెదిరించ**టానికి** అమోఘంగా **పనిచేస్తుం**ది. వేరొక వైపు ఈ చర్యద్వారా సమాజంలో, సమాజ ప్రజల్లో నైతిక జాగృతి ఉందని నిరూపితమవుతుంది. ఒకవేళ సక్రమ సంతానం కలిగిన మరియు అక్రమ సంతానం కలిగిన ఇద్దరు తల్లులకు ఒకే హోదాను కల్పిస్తే దీనిఅర్థం ఏమిటి? సమాజం నుండి మంచి చెడు, పుణ్యము పాపము, అక్రమం సక్రమం అనే వ్యత్యాసమే అంతమై పోతుంది. ఒకవేళ ఇది సాధ్యపడిందే అనుకోండి, అయినప్పటికి అక్రమ సంతానం కలిగిన తల్లి కష్టాలు కడతేరుతాయా? ఆమె బాధలన్నీ దూరమైపోతాయా? అక్రమ సంతానం, సక్రమ సంతానం కలిగిన ఇద్దరు తల్లుల్ని మీదృష్టిలో, మీ సిద్ధాంతంలో సమానమనిపించుకోవచ్చునేమో కాని ప్రకృతి మాత్రం వీరిద్దరిని సమానంగా లెక్కించదు, వీరిద్దరూ ఎన్నటికీ సమానం కాలేరు. బుద్ధిజ్ఞానాల రీత్యా, తర్కంరీత్యా, న్యాయం రీత్యా, యదార్థతరీత్యా ఏవిధంగా చూసినా వీరిద్దరు సమానం కాలేరు. లైంగిక కోరికల క్షణిక ఉద్రేకంలో తననుతాను మరిచిపోయి, తననుగాని తనకు పుట్టబోయే పిల్లవానికిగాని సాకటానికి, సంరక్షించటానికి ఎలాంటి భరోసా ఇవ్వని స్వార్థపరుడైన ఒక మగవానికి శరీరం

అర్పించుకున్న ఒక మూర్ఖపు స్త్రీ, బాధ్యతాపరుడు, గౌరవనీయుడు అయిన ఒక పురుషుడు లభించేంతవరకు తన కోరికల్ని, ఉద్రేకాల్ని నియంత్రణలో ఉంచుకున్న శీలవతి అయిన స్త్రీతో ఎలా సమానం కాగలదు? ఏ బుద్ధిజ్ఞానాలు వీరిద్దరిని సమానమన గలుగుతాయి? మీరు కోరుకున్నట్లయితే వీరిద్దరిని కృత్రిమంగా, ప్రదర్శనా నిమిత్తం సమానం చేసుకోవచ్చు. అయితే ఒకే భర్తతో జీవితం గడుపుతున్న స్త్రీకి లభించే పోషణ, సంరక్షణల గ్యారంటీని ఆ ప్రేమ వాత్సల్యాలను, అనురాగ పూరితమైన ఆ యోగక్షేమాలను, ఆ శాంతిని, ఆ నిశ్చలతను, ఆ నమ్మకాన్ని, ప్రేమపూర్వకమైన ఆ అనుబంధాన్ని ఆ మూర్ఖ స్త్రీకి ఎక్కడినుండి సమకూర్చ గలుగుతారు? ఆమె పిల్లవానికి కేవలం తండ్రి మాత్రమే చూపగలిగే కరుణా వాత్సల్యాలు ఏ బజారు నుండి కొనిపెడ్తారు? మహాఅయితే చట్టసహాయంతో ఆమెకు జీవనభృతి ఇప్పించగలరేమో, అయితే ఒక స్త్రీకి ఒక పిల్లవానికి ఈ ప్రపంచంలో కేవలం భృతి మాత్రంతోనే సరి పోతుందా? లేదు. అందుకని అక్రమ, సక్రమ మాతృత్వాలను సమానం చేసినంతమాత్రాన పాపంచేసిన స్త్రీలకు బాహ్యంగా ఎంత సౌకర్యం కల్పించినా వారుచేసిన ఈ పొరపాటుకు భౌతిక ఫలితాలను ఈవిధంగా జన్మించిన కారణంగా వారి పిల్లలకు కలిగే వాస్తవ నష్టాలనుండి కాపాడలేరు.

పై కారణాలవల్ల సమాజ మనుగడకు, దాని పురోగతికి, లైంగిక సంబంధాల విచ్చలవిడితనాన్ని కఠినంగా నిరోధించటం, సమాజ అత్యావస రాల్లో పరిగణింపబడుతుంది. అంతేకాదు, లైంగిక కోరికల తృప్తికోసం ఒకే ఒక ద్వారం అయిన వివాహ సంబంధం తెరిచి ఉంచక తప్పదు. వ్యక్తులకు వ్యభిచ రించే స్వాతంత్ర్యమివ్వటం అంటే వారి పట్ల అనవసరమైన పక్షపాతం చూపించటమే కాదు, సమాజానికి తీరని ద్రోహం చేయటం అవుతుంది. ద్రోహమే కాదు, సమాజ హత్యగా పరిగణించబడుతుంది. ఏ సమాజమైతే దీన్ని స్వల్ప విషయంగా భావిస్తుందో, వ్యభిచారాన్ని కేవలం వ్యక్తిగత ఆనందో ల్లాసంలో గడిపే సమయం (Having a good time)గా భావించి దృష్టి మరల్చు కుంటుందో, విచ్చలవిడి బీజార్పణ (Sowing wild oats) పట్ల సహన వైఖరిని

అవలంభిస్తుందో ఆ సమాజం ఒక మూర్ఖ సమాజమే అనబడుతుంది. దానికి తన బాధ్యతల స్పృహ లేదు. తనకు తానే శత్రువుగా వ్యవహరిస్తున్నది. ఆ సమాజానికి తన బాధ్యతల స్పృహ కనుక ఉండి ఉంటే లైంగిక సంబంధాల విషయంలో వ్యక్తిగత స్వేచ్ఛవల్ల సమాజంపై, సమాజ ప్రయోజనాలపై పడే దుష్ప్రభావాల్నే కనుక అది ఎరిగిఉంటే దొంగతనం, దోపిడి, హత్యలాంటి నేరాల దృష్టితోనే ఈ 'చర్య'ను కూడా చూడగలిగి ఉండాలి. ఇంకా అంతకన్నా తీవ్రమైన నేరంగా పరిగణించాలి. దొంగ, దోపిడీదారు, హంతకుడు ఏం చేస్తారు? మహాఅయితే ఒక వ్యక్తి లేక కొందరు వ్యక్తులకు నష్టం కలిగిస్తారు. కాని వ్యభిచారి సర్వసమాజాన్ని, దాని భావితరాలను వినాశం వైపుకు నెడ్తాడు.

వ్యక్తుల స్వార్థపరమైన దౌర్జన్యాలను ఎదుర్కోవటానికి, సమాజ ప్రయోజనాలను కాపాడటానికే చట్టం ఉనికిలోకి వచ్చిందని, చట్టబలంతోనే సమాజ ప్రయోజనాలు కాపాడబడుతున్నాయనేది సర్వవిధితం. ఈ కారణం గానే దొంగతనాన్ని, హత్యను, దోపిడీని, ఫోర్జరీని, హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన అనేకానేక విషయాలను చట్టపరంగా నేరాలని గుర్తించి, వాటికి తగిన శిక్షలు విధించి, సమాజాన్ని ఈ రుగ్మతల నుండి కాపాడటానికి ప్రయత్నం జరుగుతుంది. అటువంటప్పుడు 'వ్యభిచారం' విషయంలో చట్టం సొసైటీని ఎందుకు రక్షించకూడదు? సమాజాన్ని ఎందుకు సమర్థించకూడదు? వ్యభిచారాన్ని చట్టపరమైన నేరంగా ఎందుకు పరిగణించకూడదు?

సిద్ధాంతపరంగా కూడా వివాహం, వ్యభిచారం ఈ రెండు ఏకకాలంలో ఒక సమాజంలోని అంతర్భాగాలు కాలేవు. ఒక వ్యక్తికి బాధ్యతలు స్వీకరించ కుండానే లైంగికవాంఛలు తీర్చుకునే స్వాతంత్రమిచ్చి అదే పనికోసం వివాహ నియమాన్ని ఏర్పాటు చేయటం అర్థంలేని విషయం. ఉదాహరణకు రైలులో టికెట్టు లేకుండా ప్రయాణించటాన్ని సమర్థిస్తూనే, ప్రయాణం కోసం టికెట్టు కొనుక్కునే నియమాన్ని ఏర్పాటు చేయటం ఎలా ఉంటుంది? బుద్ధిజ్ఞానాలున్న ఏ వ్యక్తి కూడా ఏకకాలంలో ఈ రెండు పద్ధతుల ఉనికిని సమర్థించలేడు. సమంజసమైన, సముచితమైన పద్ధతి ఏమిటంటే టికెట్టు కొనాలనే నియ

మాన్నైనా తొలగించండి లేదా టికెట్టు కొనాలని నియమం విధిస్తే, టికెట్టు లేకుండా ప్రయాణించటాన్ని నేరగా పరిగణించండి. ఈవిధంగానే వివాహం, వ్యభిచారాల విషయంలో ఈ ద్వంద్వవైఖరి అసమంజసమైనదే కాదు. అహేతుకమైనది కూడాను. సమాజం కోసం వివాహ నియమం అనివార్యమని ఏ కారణాలతో దృవీకరించబడిందో, వాటితోనే వ్యభిచారాన్ని (అది ఏ రూపంలోనున్నా సరే) నేరంగా పరిగణించక తప్పదు.◆

◆ సమాజంలో ఒక అపోహను వ్యాపింపజేశారు. అదేమిటంటే వివాహానికి ముందు ఒక యువకునికి లైంగికవాంఛల తృప్తికోసం కొద్దోగొప్పో అవకాశం ఉండాలి. ఎందుకంటే యవ్వనంలో లైంగిక ఉద్రేకాన్ని ఆపటం కష్టమైన పని, అలా ఆపితే ఆరోగ్యంపై చెడుప్రభావం పడుతుంది- కాని ఈ దృక్పథం ఏ విషయాల మీద్దైతే ఆధారపడి ఉందో, అవన్నీ కల్పితమైనవి, కృత్రిమమైనవి, కామోద్రేకాల్ని లేపే తీవ్రమైన, అసామాన్యమైన (Abnormal) ఈ పరిస్థితి సామాన్య (Normal) ప్రజల్లో ఎందుకు జనిస్తుందో తెలుసా? సమాజంలోని చెడు సంస్కృతి ఈ ఆలోచనలకు, భావాలకు బలవంతంగా, ఉద్దేశపూర్వకంగా తీవ్రమైన ఉద్రేకాలకు గురిచేస్తుంది. మన సమాజంలో ప్రబలిపోయిన సినిమాలు, సాహిత్యం, నగ్నచిత్రాలు, సంగీతం, మిశ్రమ సమాజాల్లో అత్యధికంగా అలంకరించుకున్న స్త్రీలు మగవారికి తారసపడటం-వంటి కారణాలే సామాన్య ప్రజల్ని లైంగికపరంగా అసామాన్యమైన, తీవ్రమైన పరిస్థితికి గురిచేస్తాయి. అంతేకాని ప్రశాంతమైన వాతావరణంలో సామాన్య స్త్రీపురుషుల్లో తమనుతాము ఆపుకోలేనంత లైంగిక ఉద్రేకాలు పొడసూపవు. కొద్దోగొప్పో ఇలాంటి ఉద్రేకాలు పొడసూపినా, మానసిక, నైతిక శిక్షణ ద్వారా వాటిని కట్టడి చేయవచ్చు. యవ్వనదశలో లైంగిక కోరికలు తీర్చుకోకపోతే ఆరోగ్యంపై చెడుప్రభావం పడుతుందనే భావన కేవలం మోసపూరితమైనది, భ్రమింపజేసేది తప్ప ఇంకేమి కాదు. అందుకని నైతికత, ఆరోగ్యం రెండిటినీ కాపాడుకోవాలంటే సమాజంలోని ఈ చెడు సంస్కృతిని, ధనిక జీవితపు చెడు

ప్రమాణాలను మార్చక తప్పదు. వీటివల్లనే నేడు వివాహం కష్టతరమై వ్యభిచారం సులభమై పోయింది.

అజ్ఞాన సమాజంలోని స్పష్టంగా కనిపించే మరో ప్రత్యేకత ఏమిటంటే ఏ రుగ్మతల ప్రభావాలైతే పరిమితంగా, స్వల్పకాలంగా, పైకి కనపడేవిగా ఉంటాయో వాటిని వెంటనే గుర్తించగలం. కాని ఏ రుగ్మతల ప్రభావాలు బహుముఖంగా, సుదీర్ఘకాలంగా, పైకి కన్పించనివిగా ఉంటాయో వాటిని సకాలంలో గుర్తించి నిర్మూలించలేము. ఎందుకంటే వాటి ప్రభావాలు చాలాకాలం గడిచిన తర్వాత గాని బయల్పడవు. అందువల్ల వాటిని గురించి పట్టించుకోవటం జరగదు. పట్టించుకోక పోవటమే కాదు, వాటిని ఉపేక్షించటం, క్షమించటం, చివరికి అనుగ్రహించటం కూడా జరుగుతుంది. దొంగతనం, దోపిడి, హత్యలాంటి నేరాలను ప్రముఖంగాను, వ్యభిచారం లాంటి నేరాన్ని అల్పంగా చూడటానికి కారణం ఇదే. ఒక వ్యక్తి తన ఇంట్లో ప్లేగు వ్యాధి వ్యాపింపజేసే ఎలుకల్ని జమచేసి అంటురోగాల్ని వ్యాపింపజేస్తే మూర్ఖ సమాజం అతన్ని క్షమించరాని నేరస్థునిగా పరిగణిస్తుంది. ఎందుకంటే అతని చర్య స్పష్టంగా, ఎంతో హానికరమైనదిగా కన్పిస్తుంది. అయితే ఇదే ఒక వ్యభిచారి తన స్వార్థంకోసం, సమాజ జీవిత నాడీ కోసేసినా, దాని నష్టాలు ఎంత భయంకరంగా ఉన్నప్పటికీ, అవి పైకి కనపడనివిగా ఉంటాయి కనుక ఈ అజ్ఞానులకు ఆ వ్యభిచారి అన్నివిధాల క్షమార్హునిగా కనబడతాడు. అంతేకాదు అతను ఒక నేరానికి పాల్పడ్డాడనే అనుమానం కూడా వారికి రాదు. అజ్ఞానం, మూఢత్వాలకు బదులు విజ్ఞతావివేచనాలు, ప్రకృతి నియమాలు మన సమాజ సంస్కృతికి పునాదులు కాగలిగితే ఇలా వ్యవహరించటానికి ఆస్కారమే ఉండదు.

## బూతుల నిర్మూలనకు సూచనలు

ఏ పని సమాజానికి హానికరమైనదో దాన్ని రూపుమాపటానికి కేవలం చట్టంచేసి ఒక శిక్షను నిర్ణయించి వదిలివేస్తే సరిపోదు. దానితోపాటే ఇంకా నాలుగు రకాల నివారణోపాయాలను చేపట్టటం అత్యంతవసరం.

◆ విద్యాశిక్షణ ద్వారా మానవుల ఆలోచనా సరళిని సంస్కరించాలి. ఈ చర్యను వారే అసహ్యించుకునే విధంగా వారిని మానసికంగా తీర్చిదిద్దాలి. వారు దీన్ని ఒక పాపకార్యంగా భావిస్తూ, వారి అంతరాత్మనే వారిని ఈ కార్యం నుండి ఆపగలగాలి.

◆ రెండవ అంశం ఏమిటంటే సమాజ నైతికతను, ప్రజాభిప్రాయాన్ని ఈ చెడు పట్ల ఎంతగా మార్చాలంటే సామాన్య ప్రజలు దీన్ని ఒక నీచమైన, సిగ్గుమాలిన పనిగా గుర్తించేటట్లు తీర్చిదిద్దాలి. అంతేకాదు ఈ చర్యకు పాల్పడిన వాన్ని సమాజం నీచదృష్టితో చూడగలగాలి. తత్ఫలితంగా ఎవరి శిక్షణలో లోపముండి పోయిందో లేక ఎవరి నైతికత బలహీనంగా ఉందో, అలాంటివారిని ఈ ప్రజాభిప్రాయం ఈ చెడుకు పాల్పడకుండా ఆపగలుగు తుంది.

◆ మూడవ విషయం- సమాజంలో ఈ నేరాన్ని ప్రోత్సహించే దీని పట్ల ఆశ కల్గించే, దీనికి పురిగొలిపే అన్నిరకాల అవకాశాలను, సాధనాలను రూపు మాపాలి.

◆ నాలుగవ అంశం: ఒక వ్యక్తి ఎంత ప్రయత్నించినా ఈ నేరానికి పాల్పడే అవకాశం లేనివిధంగా మొత్తం సమాజంలో అనేక అవరోధాలను, అడ్డంకులను ఏర్పరచాలి.

పై నాలుగు సూత్రాలు ఎలాంటివంటే వీటి అవసరం ఔచిత్యంపై బుద్ధిజ్ఞానాలు సాక్ష్యమిస్తాయి. ప్రకృతి వాటిని కోరుతోంది. సమాజ చట్టం ఏ విషయాలనైతే నేరంగా పరిగణిస్తుందో వాటిని అరికట్టటానికి చట్టం ఒక్కటే కాక పై నాలుగు సూత్రాలు కూడా అవసరమని, కొంచెం హెచ్చుతగ్గులతో ప్రతిచోట అవి ఉపయోగపడతాయనేది సర్వప్రపంచం క్రియారూపంలో ప్రదర్శిస్తున్నది. లైంగిక సంబంధాల విచ్చలవిడితనం, సంస్కృతికి ప్రమాదకర మని, సమాజానికి వ్యతిరేకంగా ఒక ఘోరమైన నేరమని ఒప్పుకున్నప్పుడు దీన్ని అరికట్టడానికి చట్టంతోపాటే పైనుదహరించిన నివారణోపాయాలు కూడా అవలంబించాలని అంగీకరించక తప్పదు. అందుకని ప్రజల్ని సుశిక్షితుల్ని

చేయాల్సి ఉంటుంది. ప్రజాభిప్రాయాన్ని ఈ చర్యకు వ్యతిరేకంగా మలచాల్సి ఉంటుంది. ప్రజల లైంగికభావాల్ని ఉద్రేకపరిచే సర్వవిషయాలను సమాజం నుండి, సంస్కృతి నుండి నిర్మూలించాల్సి ఉంటుంది. వివాహంలో అడ్డం కులు సృష్టిస్తున్న సర్వకారణాలను సమాజం నుండి తీసివేయాల్సి ఉంటుంది. దాంపత్య సంబంధాలు తప్ప ఇతర లైంగిక సంబందాల పట్ల మొగ్గు చూపే స్త్రీ పురుషుల కలయికపై బలమైన అర్థవంతమైన అవరోధాలను ఏర్పరచాలి.

కొంతమంది ఏ నైతిక, సామూహిక ప్రాతిపదికలపై వ్యభిచారం నేరంగా, పాపంగా పరిగణించబడిందో వాటన్నిటినైతే ఒప్పుకుంటారు. కాని దీన్ని రూపుమాపటానికి అవలంబించే చట్టపరమైన నిరోధక చర్యల్ని తీవ్రంగా నిరసిస్తారు. దీనికి బదులు కేవలం సంస్కరణ పద్ధతులే చాలని వారి వాదన. వారనేదేమంటే విద్యాశిక్షణల ద్వారా వారిలో మార్పుతేవాలని చెబుతారు. అలా కాకుండా చట్టపరంగా, శాసనబలంతో నిరోధక పద్ధతుల ద్వారా కట్టడి చేస్తున్నారంటే దీని అర్థం వారి పట్ల పసిపిల్లల్లా ప్రవర్తిస్తున్నట్లే. ఇది వారి మానవత్వాన్ని కించపరిచినట్లే. సరెలెండి. మేము కూడా వారి ఈ వాదనతో ఏకీభవిస్తాము. ప్రజల్ని సంస్కరించే శ్రేష్టమైన పద్ధతి ఇదేననే విషయాన్ని మేమూ ఒప్పుకుంటాము. మానవ సంస్కృతి ఉద్దేశమే అది. ప్రజల హృదయాల్లో ఎటువంటి నిగ్రహశక్తిని పెంపొందించాలంటే ఎలాంటి బాహ్యశక్తి ప్రమేయం లేకుండానే వాటంతట వారే సమాజసూత్రాలను చట్టాలను గౌరవించగలగాలి. వారి అంతరాత్మే వారిని లోపలినుండి ఈ నైతిక రుగ్మతల దరిదాపులకు కూడా పోకుండా ఆపేయాలి. ఈ లక్ష్యసాధన కోసమే ప్రజల్ని విద్యావంతులుగా, సంస్కారవంతులుగా తీర్చిదిద్దే ప్రయత్నాలు జరుగుతాయి. సమాజ వ్యవస్థ రక్షణ కోసం ఎలాంటి బాహ్యశక్తిగాని, శాసనశక్తిగాని అవసరం లేనంతగా విద్యాసంస్కారాల ద్వారా మానవుల ఆత్మప్రక్షాళనం జరిగి, వారిని పూర్తిగా నమ్మేంతస్థాయికి సమాజం ఎదిగిందనేది నిజమేనా? ప్రాచీన కాలాన్ని విడిచిపెట్టండి. మీ దృష్టిలో అది చీకటియుగం. దేదీప్యమానంగా వెలిగి పోతున్న, కళ్ళను మిరిమిట్లు గొలిపే ఇరవయ్యోకటవ శతాబ్దపు స్వర్ణ యుగాన్నే

తీసుకుందాం. నేటి ఆధునిక యుగంలో యూరప్, అమెరికాకు చెందిన ప్రతి వ్యక్తి విద్యావంతుడైన తమ పౌరుల ఉన్నత విద్యాప్రమాణాలకు గర్విస్తున్న దేశాల్నే తీసుకోండి. విద్యా, శిక్షణలే ధ్యేయంగా పెట్టుకొని సుశిక్షితులుగా చేసిన ఆ సమాజంలో నేరాలు, శాసనోల్లంఘనలు ఆగిపోయాయా? దొంగతనాలు సమసిపోయాయా? దోపిడీ ఆగిపోయిందా? హత్యలు జరగటం లేదా? మోసం, దగా, దౌర్జన్యం, హింసాత్మక కార్యకలాపాలు ఆగిపోయాయా? అక్కడ పోలీస్, న్యాయస్థానాలు, జైళ్ళు, సామాజిక కట్టడుల అవసరం లేకుండా పోయిందా? అక్కడి ప్రజల్లో నైతిక స్పృహ, నైతిక బాధ్యతల పట్ల ఎంత అవగాహన ఏర్పడిందంటే వారితో "పిల్లల్లాగా ప్రవర్తించే" అవసరం లేకుండా పోయిందా? ఇది నిజం కాదు. అలా లేనప్పుడు, ఈ స్వర్ణయుగంలో కూడా సమాజ సూత్రాలను, నియమాలను కేవలం మానవుల నైతిక బాధ్యతలపై విడిచిపెట్టటం జరగలేదు. నేడు కూడా నేరనివృత్తి కోసం శాసనపరమైన నిరోధక పద్ధతులు ఉపయోగిస్తున్నప్పటికీ 'మానవత్వాన్ని కించపరటం' ఆగిపోనప్పుడు కేవలం లైంగిక సంబంధాల విషయంలో మాత్రమే ఈ కట్టడి, అవరోధాలు మీకెందుకు అన్యాయంగా కనబడుతున్నాయి? మానవత్వాన్ని కించపరిచి నట్లుగా భావించటమెందుకు? పై నేరాలను నిర్మూలించటంలో ఈ రెండు పద్ధతులను అవలంబిస్తే మీకెలాంటి అభ్యంతరముండదు. కాని లైంగిక విషయానికొస్తే మాత్రం మీకు ఇది అన్యాయంగా, మానవత్వాన్ని కించపరిచి నట్లుగా కనబడుతుంది. ఈ ఒక్క వ్యవహారంలోనే మీరు ఈ 'పిల్లల'తో 'పెద్దలు'గా వ్యవహరించమని ఎందుకు పట్టుబడుతున్నారు? దొంగతనం, దోపిడీ, హత్య, మోసం, దగా, ఫోర్జరీలాంటి నేరాల నివారణకు చట్టపరమైన, నైతిక పరమైన రెండు సాధనాలు వినియోగించినప్పుడు లేని అభ్యంతరం, బాధ, అసహనం కేవలం వ్యభిచారం విషయంలోనే మీకెందుకు కలుగుతుంది? వ్యభిచార విషయంలో కేవలం నైతిక పరమైన పద్ధతులే చాలని మీరు వాదించటంలో గల అర్థమేమిటో? కాస్త ఆలోచించండి. మీ అంతరంగంలో ఏ మూలనైనా ఏ దొంగైతే దాగిలేడు కదా!!

ఏ విషయాలనైతే మీరు లైంగిక ఉద్రేకాలకు కారణభూతమని సమాజం నుండి, సంస్కృతి నుండి ఏరివేయదలిచారో, అవయితే ఆర్ట్, కళ, సౌందర్యాన్ని అభిమానించే దానికి ప్రతీకలు కదా, అవే కనుక లేకపోతే మానవ జీవితంలో సారమే లేకుండా పోతుంది. అందుకని సంస్కృతి రక్షణ కోసం, సమాజ సంస్కారం కోసం, మీరేమైనా చేయండి. కాని ఈ లలితకళల్ని, ఈ సౌందర్యాన్ని మాత్రం నష్టపరచకండి అనేది కొందరి వాదన. ఆర్ట్ మరియు సౌందర్యా భిమానానికి సంబంధించినంత వరకు ఇవి అమూల్యమైనవని అవి పురోభివృద్ధి చెందాలనే దానికి మేము వ్యతిరేకించటం లేదు. అయితే సమాజ జీవితం, సామూహిక శ్రేయం వీటన్నిటికన్నా విలువైనవి. వీటిని ఆర్ట్, సౌందర్యాభిమానం కోసం త్యాగం చేయటం జరగదు. పై కళలు మనగలగా లంటే, వృద్ధి వికాసాలు చెందాలంటే అవి సమాజ జీవితం, సామూహిక శ్రేయంతో ఏకీభవించి నడవాలి. ఏ కళ, ఏ సౌందర్యాభిమానం అయితే జీవి తానికి బదులు మరణం వైపుకు, శ్రేయానికి బదులు సంక్షోభం వైపుకు తీసుకు పోతుందో, దానికి సంఘపరిధిలో, సమాజ జీవితంలో ఎలాంటి స్థానం లేదు. ఇది కేవలం మేము మాత్రమే ప్రతిపాదించే వ్యక్తిగత సూత్రం కాదు. వివేకం, ప్రకృతి అభిలషించేది కూడా ఇదే. సర్వప్రపంచం సిద్ధాంతరీత్యా దీన్ని ఒప్పు కుంటుంది. ప్రతిచోట దీనిపైనే నడవటం జరుగుతుంది. ప్రపంచంలో ఎక్కడైనా సరే, ఏ విషయాలైతే, ఏ కళ అయితే, సామూహిక జీవితానికి, సంఘ శ్రేయస్సుకు విఘాతం కలిగిస్తుందో హాని చేకూర్చుతుందో, అదెంత సున్నితమైన దైనా అమూల్యమయినదయినా సరే సమాజంలో అనుమతించబడదు. ఉదాహరణకు ఏ సాహిత్యమయితే సమాజంలో కలతను, కల్లోలాన్ని, సంక్షోభాన్ని, హత్యాదౌర్జన్యాలను పురిగొలుపుతుందో, సాహిత్యపరంగా అదెంత ఉన్నతమయినా, సమాజంలో అనుమతింపబడజాలదు. ప్లేగు, కలరా, ఏయిడ్స్‌లాంటి రోగాలను వ్యాపింపజేయ పురిగొల్పుతున్న ఏ సాహిత్యమూ ఏ సమాజంలో కూడా అనుమతింపబడజాలదు. ఏ సినిమా అయినా శాసన నోల్లంఘనానికి, తిరుగుబాటుకు ప్రోత్సహిస్తుందో ప్రపంచంలోని ఏ ప్రభుత్వం

కూడా దీన్ని ప్రదర్శించటానికి అనుమతి ఇవ్వజాలదు. ఏ చిత్రాలయితే దౌర్జన్యాన్ని, కల్లోలాన్ని, దుర్మార్గాన్ని ప్రేరేపిస్తాయో, ఆ భావాల్ని ప్రతిబింబి స్తాయో లేక సర్వాంగీకృతమైన నైతిక విలువల్ని కాలరాయటం జరుగుతుందో అవి కళరీత్యా ఎంత విలువయినవైనా సరే ఏ చట్టమూ, ఏ సొసైటీ వాటిని గౌరవించజాలదు. జేబులు కత్తిరించటమనే కళ అత్యంత సున్నితమైన, సూక్ష్మమైన కళ. హస్తలాఘవానికి సంబంధించి దీనికి మించినది వేరొకటి ఉందో లేదో తెలియదు కాని ఈ కళ వృద్ధివికాసాలు చెందాలని ఎవరూ కోరు కోరు. ఫోర్జరీతో దొంగనోట్లు, దొంగచెక్కులు, దొంగ దస్తావేజులు సృష్టించటం అత్యంత తెలివితేటలతో కూడుకున్న పని. కాని ఎవరు కూడా ఈ కళ అభివృద్ధిని సమర్థించలేరు. మోసగించటంలో మానవమేథస్సు తన సృజనాత్మక శక్తికి సంబంధించిన అమోఘమైన నిదర్శనాలను ప్రదర్శిస్తుంది. కాని ఏ సభ్య సమాజం కూడా ఈ సృజనాత్మక శక్తుల్ని గౌరవించటానికి సంసిద్ధం కాజాలదు. అందుకనే సమాజ జీవితం, సమాజ శాంతిశ్రేయస్సులు అన్ని ఆర్ట్, కళలకన్నా అత్యున్నతమైనదనేది సర్వామోదితమైన సూత్రం. సమాజ జీవితానికి, సమాజ శ్రేయస్సుకు మించినదేదీ లేదు. అందుకని ఏదో కళ కోసం సమాజాన్ని బలి ఇవ్వటం జరగదు. ఈ విషయంలో వ్యత్యాసం ఏమిటంటే ఒక విషయాన్ని సమాజ జీవితం దృష్ట్యా, సమాజ శ్రేయస్సు దృష్ట్యా నష్టదాయకమని మేము భావిస్తాము. ఇతరులు అలా అంగీకరించరు. ఈ సందర్భంలో వారి దృక్పథం కూడా మాతో ఏకీభవిస్తే ఆర్ట్ మరియు ఇతర లలితకళలపై అవే ఆంక్షలు విధించే అవసరాన్ని వేటినైతే మేము గుర్తించగలిగామో వారు కూడా గుర్తించ గలుగుతారు.

అక్రమ సంబంధాల నివారణకు స్త్రీ పురుషుల కలయికలో అడ్డంకులు సృష్టించటం, సమాజంలో వారి స్వేచ్ఛాయుతమైన కలయికపై ఆంక్షలు విధించటం- ఇవన్నీ వారి నడవడికపై, వారి నైతికతపై దాడిచేయటం కాదా అని కొందరు ప్రశ్నిస్తారు. ఈ చర్యవల్ల ప్రలందరిని తిరుగుబోతులుగా, శీలహీనులుగా ముద్రించినట్లు కాదా? ఇలాంటి ఆంక్షలు విధించేవారికి తమ

స్త్రీలపైగాని, తమ పురుషులపైగాని విశ్వాసం లేదన్నట్లేగా! వినటానికి ఈ మాటలు ఎంత హేతుబద్ధంగా కనబడుతున్నాయి. అయితే ఈ రకమైన తర్కాన్ని ఇంకొంచెం ముందుకు సాగనివ్వండి. ఇంటికి వేయబడే ప్రతి తాళం దేన్ని సూచిస్తుంది? ఆ ఇంటి యజమాని సర్వప్రపంచాన్ని దొంగలుగా భావించాడా? ప్రతి పోలీసు ఉనికి, ప్రభుత్వం తన ప్రతి పౌరుని దౌర్జన్య పరునిగా భావించిందనటానికా? ప్రతి లావాదేవీల్లో దస్తావేజులు వ్రాసుకోవటం దేనికి? ఒక పక్షం, రెండవ పక్షాన్ని అపహరించేవానిగా భావించాడనా? ఈరకమైన తర్కంతోనైతే మీరు ప్రతిక్షణం దొంగగా, దౌర్జన్యకారునిగా, అనుమానాస్పద వ్యక్తిగా ముద్రింపబడుతున్నారు. అయితే మీ ఆత్మాభి మానానికి ఎలాంటి భంగము కలగటంలేదు; ఎలాంటి బాధ కలగటంలేదు. ఎలాంటి న్యూనతా భావానికి గురికావటంలేదు. మరయితే ఈ ఒక్క లైంగిక విషయంలోనే మీ ఆత్మాభిమానం, మీ భావాలు ఇంత సున్నితంగా ఎందుకు మారిపోయినట్లు?

అసలు విషయం పైన సూచనాప్రాయంగా తెలిపే ఉన్నాము. అదే మిటంటే ఇటువంటివారి బుర్రల్లో పాత నైతిక విలువల ప్రభావం ఎంతో కొంత ఇంకా మిగిలిఉంది. అందుకనే వారు వ్యభిచారాన్ని, లైంగిక విచ్చలవిడి తనాన్ని చెడుగానైతే భావిస్తారు కాని, మరీ అంత చెడుగా, నామరూపాలు లేకుండా తొలగించేంత చెడుగా భావించే స్థితిలో లేరు. అందుకే సంస్కరణ, నివారణోపాయాలకు సంబంధించి వారి దృక్పథం మా దృక్పథానికి భిన్నంగా ఉంది. ప్రకృతి వాస్తవాలు పూర్తిగా వారి ముందు బహిర్గతమయితే ఈ వ్యవహా రానికి సంబంధించి నిజమైన స్థితిని వారు అర్థం చేసుకోగలిగితే మానవుడు మానవునిగా ఉన్నంతవరకు అతనిలో పాశవిక వ్యక్తిత్వం ఉన్నంతవరకు వ్యక్తుల కోరికల్ని వారి అభిరుచులకు మించి సామూహిక జీవితపు శ్రేయాన్ని కాంక్షించే ఏ సమాజం కూడా ఈ నివారణాపద్ధతుల్ని విడనాడజాలదనే అంశంపై వారు మాతో ఏకీభవించక తప్పదు.

# దాంపత్య సంబంధాల సక్రమ పద్ధతి

కుటుంబ నిర్మాణం, లైంగిక విశృంఖలత్వ నివారణ తరువాత ఒక మంచి సమాజం కోసం సాంఘిక వ్యవస్థలో స్త్రీపురుష సంబంధాలకు సరియైన సముచితమైన విధానాన్ని రూపొందించటం అత్యంతవసరము. వారి హక్కులు సక్రమంగా, న్యాయపరంగా లభించాలి. వారి బాధ్యతలు కూడా న్యాయంగా విభజించబడాలి. కుటుంబంలో వారి స్థానాన్ని వారి విధుల్ని ఎలాంటి హెచ్చు తగ్గులు రాకుండా నిర్ణయింపబడాలి. సంస్కృతికి సంబంధించిన అన్ని సమస్యల్లో ఈ సమస్య అత్యంత జటిలమైనది. అందుకే మానవునికి ఈ సమస్యను పరిష్కరించటంలో తరుచుగా అపజయమే ఎదురయింది.

కొన్ని జాతుల్లో స్త్రీలకు పురుషులపై ఆధిపత్యం ఇవ్వబడింది. అయితే ఇలాంటి జాతుల్లోనుండి ఏ జాతి అయినా సభ్యతా సంస్కృతుల శిఖరాల నందుకున్న జాడ మనకు కనిపించదు. స్త్రీలను పాలకులుగా నియమించుకొని ప్రపంచంలో గౌరవోన్నతులు పొంది, శక్తిసామర్థ్యాలను ప్రదర్శించిన ఏ జాతి చరిత్రలో మనకు కనిపించదు.

ప్రపంచంలోని అత్యధిక జాతులు పురుషునికి స్త్రీపై ఆధిపత్యా న్నిచ్చాయి. కాని ఈ ప్రత్యేకత లేక ఆధిపత్యం తరుచుగా దౌర్జన్యరూపం దాల్చింది. స్త్రీని బానిసగా మార్చివేయటం జరిగింది. ఆమెను కించపరచటం, హేళన చేయటం జరిగింది. ఆమెకు ఎలాంటి ఆర్థిక, సామాజిక హక్కులు ఇవ్వబడలేదు. కుటుంబంలో ఆమెను ఒక పనిమనిషిగా, పురుషుని లైంగిక అవసరాలు తీర్చే యంత్రంగా మార్చటం జరిగింది. కుటుంబ వ్యవస్థకు అవల, ఒక వర్గం స్త్రీలను కొంతవరకు విద్యాసంస్కృతుల సుగంధాలు ప్రసా దించినా అవి కేవలం పురుషుల లైంగిక కోరికల్ని మనోరంజకంగా నెరవేర్చ టానికి మాత్రమే ఉపయోగించుకున్నారు. తమ మధుర సంగీతం ద్వారా చెవులకింపు కలిగించటం, తమ నృత్యం, తమ అందచందాల ద్వారా కళ్ళకు హాయి కలిగించటం, తమ లైంగిక ప్రావీణ్యతలతో పురుషుల శారీరక తృప్తిని

ఇనుమడింపజేయటమే వారి పరమార్థంగా భావించబడింది. పురుషుడు తమ కామవాంఛను తీర్చుకోవటానికి సృష్టించిన ఈ పద్ధతి స్త్రీల నీచత్వానికి, అవమానానికి పరాకాష్టగా నిలిచింది. అయితే ఏ జాతులయితే ఈ పద్ధతి అవలంబించాయో అవి కూడా దీని నష్టాన్నుండి తప్పించుకోలేక పోయాయి.

ఆధునిక పాశ్చాత్య సమాజం మూడవ పద్ధతిని అవలంబించింది. అంటే స్త్రీపురుష సమానత్వం. ఇద్దరి బాధ్యతలు సమానంగాను, ఇంచు మించు ఒకేవిధంగాను ఏర్పరిచారు. ఇద్దరూ ఒకే విధమైన కార్యపరిధిలో ఒకేరకంగా పోటీపడాలి. ఇద్దరూ తమ భుక్తిని తామే ఆర్జించుకోవాలి. తమ అవసరాలు తామే తీర్చుకోవాలి. సమాజ నిర్మాణానికి సంబంధించిన ఈ సూత్రం ఇంకా పూర్తి కాలేదు. ఎందుకంటే పురుషుని ఆధిక్యత, శ్రేష్టత ఇంకా కనిపిస్తున్నది. జీవితంలోని ఏ రంగంలో కూడా స్త్రీ పురుషునికి సరిసమానం కాలేకపోయింది. సంపూర్ణ సమానత్వం ద్వారా లభించవలసిన సర్వహక్కులు ఇంకా ఆమెకు లభించలేదు. అయితే ఏ కొంతమేరకు సమానత్వాన్ని పాటించారో దానిలో ఇప్పటినుండే సామాజిక వ్యవస్థలో అల్లకల్లోలం ప్రారంభ మయింది. ఇంతకుముందే దీనికి సంబంధించిన పరిణామాలను విశదీ కరించాము కనుక తిరిగి దాని గురించి చర్చించనవసరం లేదు.

పై మూడురకాల సంస్కృతులు కూడా న్యాయం, ఔచిత్యం, సమతుల్యాలను పాటించలేదు. వారు ప్రకృతి మార్గదర్శకాన్ని అర్థం చేసు కోవటంలో, దాని ప్రకారం సామాజిక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవటంలో విఫలమయ్యారు. ఒకవేళ సరైన జ్ఞానం, వివేకాలతో ఆలోచిస్తే ప్రకృతే ఈ సమస్యలకు పరిష్కారం సూచిస్తుందని తెలిసివస్తుంది. అంతేకాదు స్త్రీని ఎంతగా దిగజార్చటానికి ప్రయత్నం జరిగిందో ప్రకృతి బలీయమైన శక్తి కారణంగానే ఆమె అంతగా దిగజారలేకపోయింది. అంతేకాక ఎంతగా ఎదగాలని ఆమె కోరుకుందో, లేక పురుషుడు ఆమెను ఎదిగింపటానికి ప్రయత్నించాడో అంతగా కూడా ఆమె ఎదగలేకపోయింది. హెచ్చుతగ్గులకు సంబంధించిన ఈ రెండు కోణాలు కూడా మానవుడు తన వక్రబుద్ధితో,

మిడిమిడి జ్ఞానంతో ఏర్పాటు చేసుకున్నవే. అయితే ప్రకృతి న్యాయం, సమతుల్యాన్ని కోరుతుంది. అంతేకాదు తానే దానికి రూపకల్పన కూడా చేస్తుంది.

మానవులైనందువలన స్త్రీపురుషులు ఇద్దరూ సమానమే అనే విషయాన్ని ఎవరూ నిరాకరించలేరు. మానవజాతికి చెందిన వీరిద్దరూ సమాన భాగాలు. సమాజ నిర్మాణంలో, సంస్కృతిని రూపొందించటంలో, మానవ సేవలో ఇద్దరూ సమాన భాగస్వాములే. హృదయం, వివేకం, మేధస్సు, కోరికలు, వాంఛలు, ఉద్రేకాలు ఇతర మానవ అవసరాలు ఇద్దరికీ ఉన్నాయి. సమాజసేవలో తమ వంతు పాత్ర పోషించటానికి సమాజశ్రేయం, ప్రగతులు సాధించటానికి ఇద్దరి మానసిక, జ్ఞానపరమైన, ఆలోచనాశక్తుల శిక్షణ, తర్ఫీదు సమానంగానే అత్యంతవసరము. ఈ విషయాల్లో సమానత ప్రతిపాదన నూటికి నూరుపాళ్ళు సరియైనది. అంతేకాక పురుషుల్లాగే స్త్రీలకు కూడా వారి స్వాభావిక సామర్థ్యం యోగ్యతలననుసరించి అత్యధికంగా అభివృద్ధి చెందటానికి అవకాశమివ్వటం ప్రతి సభ్యసమాజం ప్రప్రథమ విధి. వారిని ఉన్నతవిద్యా, శిక్షణలతో సంస్కరించాలి. పురుషుల్లాగే వారికీ సామాజిక, ఆర్థిక హక్కుల్ని ప్రసాదించాలి. వారికి సమాజంలో గౌరవప్రదమైన స్థానాన్ని కల్పించాలి. ఫలితంగా వారిలో ఆత్మాభిమానం పెరిగి వారిలో శ్రేష్టమైన మానవతా గుణాలు జనిస్తాయి. కేవలం ఆత్మాభిమానం ద్వారానే ఇవి సాధ్యపడతాయి. ఏ జాతులైతే ఈ రకమైన సమానత్వాన్ని ఇవ్వ నిరాకరించాయో, ఎవరయితే తమ స్త్రీలను అజ్ఞానులుగా, నీచులుగా భావించి సామాజిక హక్కుల నుండి దూరముంచాయో ఆ జాతులు అదఃపతనానికి దిగజారిపోయాయి. ఎందుకంటే మానవ సమాజ సగభాగాన్ని దిగజార్చటమంటే స్వయంగా మానవత్వాన్నే దిగజార్చటమవుతుంది. నీచంగా చూడబడే తల్లుల ఒడిలో నుండి గౌరవనీయులు, అశిక్షితులైన తల్లుల ఆలింగనంతో సుశిక్షితులైనవారు, అల్పబుద్ధి కలిగిన తల్లుల శిక్షణలో మహోన్నత భావాలు కలిగిన వ్యక్తులు బయటికి రాజాలరు.

అయితే సమానత్వానికి సంబంధించిన రెండవ దృశ్యం ఏమిటంటే స్త్రీపురుషుల కార్యాచరణ పరిధి ఒకటే అయి ఉండాలి. ఇద్దరూ ఒకేవిధమైన పనిచేయాలి. ఇద్దరిపై జీవితానికి సంబంధించిన అన్నిరంగాల బాధ్యతలు ఒకేరకంగా మోపటం, సామాజిక వ్యవస్థల్లో ఇద్దరిస్థాయి, స్థానం ఒకేలా ఉంచటం. దీనికి సాక్ష్యంగా వైజ్ఞానిక ప్రయోగాలు, పరిశోధనల ఫలితాల ఆధారంగా స్త్రీపురుషులిద్దరూ తమ శారీరక శక్తిసామర్థ్యాల రీత్యా సమానం (Equipotential) అని రుజువు చేయుటానికి ప్రయత్నింపబడుతుంది. వీరిద్దరిలో ఈరకమైన సమానత్వం కనబడినంతమాత్రాన వీరిద్దరితో ఒకేరకమైన పని తీసుకోవటం ప్రకృతి లక్ష్యమని చెప్పటానికి ఆస్కారంలేదు. ఇద్దరి శారీరక వ్యవస్థలు కూడా ఒకేవిధంగా ఉన్నాయని, ఇద్దరిపై ప్రకృతి ఒకేరకమైన బాధ్యతల భారాన్ని మోపిందని ఇద్దరి మానసిక స్థితిగతులు కూడా ఒకేవిధంగా ఉన్నాయని రుజువు కానంతవరకు ఇలాంటి అభిప్రాయానికి స్థానంలేదు. మానవుడు నేటివరకు ఎన్ని వైజ్ఞానిక పరిశోధనలు జరిపాడో వాటన్నిటి ద్వారా పైమూడు అంశాల ఫలితం కాదనే బయల్పడింది.

జీవశాస్త్ర (Biology) పరిశోధనల వల్ల స్త్రీ తన రూపురేఖలు, బాహ్య అవయవాలతో మొదలుకొని తన శారీరక అణువులు, మాంసకృత్తులతో ఏర్పడిన జీవకణాల (Protien Molecules of Tissue cells) వరకు, ప్రతి విషయంలోనూ పురుషునికి భిన్నంగా ఉంది. గర్భాశయంలోని పిండంలో శిశు నిర్మాణం ప్రారంభమైనప్పటినుండే రెండు స్త్రీ పురుషుల శారీరక ఆకృతి పరస్పర విరుద్ధ రూపాల్లో అభివృద్ధి చెందుతుంది. స్త్రీ యొక్క పూర్తి శారీరక వ్యవస్థ శిశువును జన్మనివ్వటానికి వానిని సాకటానికి అనువుగా మలచబడింది. ప్రారంభంలో పిండ నిర్మాణం మొదలుకొని యవ్వనదశకు చేరేంతవరకు ఆమె శరీర నిర్మాణం ఈ యోగ్యతను పరిపూర్ణం చేసే దిశలోనే పయనిస్తుంది. ఈ విషయమే ఆమె రాబోయే జీవితానికి దిశను నిర్ధారిస్తుంది.

రజస్వల కాగానే రుతుదినాలు ప్రారంభమవుతాయి. దీని ప్రభావంతో శరీరంలోని అన్ని అవయవాల పనితనం ప్రభావితమవుతోంది. జీవశాస్త్ర

మరియు అవయవశాస్త్ర నిపుణుల అధ్యయనం, పరిశీలనలను అనుసరించి రుతుదినాలలో స్త్రీలో ఈ క్రింది మార్పులు సంభవిస్తాయి.

1. శరీరంలో ఉష్ణాన్ని ఆపే శక్తి సన్నగిల్లుతుంది. అందుకని ఉష్ణం అత్యధికంగా విసర్జించబడుతుంది.
2. నాడి మందగిస్తుంది. రక్తపోటు తగ్గిపోతుంది. జీవకణాల సంఖ్యలో వ్యత్యాసం ఏర్పడుతుంది.
3. అంతఃస్రావక (Endocrines), కొండనాలుక (Tonsils), శోషరస గ్రంథుల (Lymphatic Glands)లో మార్పు వస్తుంది.
4. మాంసకృత్తుల జీవక్రియలో (Protien Metabolism) బలహీనత ఏర్పడుతుంది.
5. పాస్ఫేట్స్, క్లోరైడ్స్‌ల విసర్జన తగ్గిపోతుంది. వాయువుల జీవక్రియ (Gaseous Metabalism)లో అంతరాయం ఏర్పడుతుంది.
6. జీర్ణశక్తి మందగిస్తుంది. ఆహారంలోని ప్రోటీన్ అంశాలు, కొవ్వు శరీరంలో కలిసిపోవటం తగ్గిపోతుంది.
7. శ్వాస శక్తి తగ్గిపోతుంది. మాట్లాడే అవయవాల్లో ప్రత్యేక మార్పులు సంభవిస్తాయి.
8. అవయవాల్లో నీరసం, గ్రహణ శక్తుల్లో మందకోడితనం ఏర్పడతాయి.
9. వివేకాన్ని, ఆలోచనల్ని కేంద్రీకరించే శక్తి సన్నగిల్లిపోతుంది.

పైనుదహరించిన ఈ మార్పులు, ఒక ఆరోగ్యవంతమైన స్త్రీని రోగస్థితికి ఎంత దగ్గరికి తీసుకుపోతాయంటే ఆరోగ్యానికి వ్యాధికి మధ్య గుర్తించ నలవిగాని పరిస్థితి ఏర్పడుతుంది. ఎలాంటి కష్టంగాని, బాధగాని లేకుండా రుతుస్రావం జరిగే స్త్రీలు బహుకష్టంగా నూటికి 23 మంది ఉంటారేమో! ఒకసారి, ఎంపిక చేయకుండానే 1020 మంది స్త్రీలను వారి పరిస్థితి గురించి

పరిశోధించటం జరిగింది. అందులో 84 శాతం స్త్రీలు ఋతుదినాల్లో బాధ, ఇంకా వేరే రకాలయిన కష్టాలను అనుభవిస్తున్నట్లు తెలిసింది. ఈ విభాగ అధ్యయనంలో గొప్ప పరిశోధకుడైన డాక్టర్ అమేల్ నోవక్ ఇలా వ్రాస్తున్నాడు. "ఋతుదినాల్లో ఉన్న స్త్రీలు సామాన్యంగా ఈ పరిస్థితులనెదుర్కుంటారు. తలనొప్పి, అలసట, అవయవాల నొప్పి, నరాల బలహీనత, శరీరంలో నీరసం, మూత్రాశయంలో అసహనం, జీర్ణశక్తిలో లోపం, కొన్ని సందర్భాల్లో అజీర్ణం, అప్పుడప్పుడు వికారం, వాంతి, స్థనాల్లో కొద్దిపాటి నొప్పి, కొన్ని సందర్భాల్లో పోట్లు పొడిచినంతగా బాధపడే స్త్రీల సంఖ్య గణనీయంగానే ఉంది. కొంతమంది స్త్రీల గొంతు వాచి బొంగురుపోతుంది. కొన్ని సమయాల్లో జీర్ణం అస్తవస్థమయి పోతుంది. తరుచుగా శ్వాస తీసుకోవటంలో కష్టమవు తుంది. డాక్టర్ క్రేగర్ పరీక్షించిన స్త్రీలలో సగంమంది ఋతుదినాల్లో అజీర్ణంతో బాధపడేవారే. చివరి దినాల్లోనయితే అసలు జీర్ణమే కాకపోయేది. డాక్టర్ గిబ్‌హార్ట్‌ను అనుసరించి, ఋతుదినాల్లో ఎలాంటి బాధలేని స్త్రీలు చాలా తక్కువగా ఉంటారు. తలనొప్పి, అలసట, నాభిక్రింద నొప్పి, ఆకలి వేయక పోవటం, స్వభావంలో విసుగు, అసహనం ఏర్పడటం, ఏడవాలనిపించటం- ఇలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొంటున్న స్త్రీలే ఎక్కువగా కనబడుతుంటారు."

పై కారణాలు, పరిస్థితుల దృష్ట్యా ఋతుదినాల్లో స్త్రీ వ్యాధిగ్రస్తురాల వుతుందనటంలో నూటికి నూరుపాళ్ళు నిజం. ఇదొరకమైన వ్యాధి ప్రతినెల ఆమెను చుట్టుకుంటూనే ఉంటుంది.

శరీరంలో వచ్చే పైమార్పుల ప్రభావం స్త్రీ మేధాశక్తులపై, వివిధ పనులు నిర్వర్తించే అవయవాలపై తప్పకుండా పడుతుంది. 1909లో డాక్టర్ Voice chersky సుదీర్ఘమైన అధ్యయనం తరువాత, ఈ కాలంలో (అనగా ఋతుదినాల్లో) ఆమెలో ఆలోచనల్ని కేంద్రీకృతం చేసేశక్తి, మేధస్సులో

శ్రమకోర్చేశక్తి సన్నగిల్లుతుందనే ఫలితాన్ని బహిర్గతం చేశాడు. ప్రొఫెసర్ krschiskevsky మానసిక అధ్యయనాల తరువాత ఈ కాలంలో స్త్రీ నాడీ వ్యవస్థ అత్యంత ఉద్రేకస్థితిలో ఉంటుందనే నిర్ణయానికి వచ్చాడు. ఆలోచనల్లో అనిశ్చిత, అసంబద్ధతలు ఏర్పడతాయి. పొందుపరచబడిన విషయాలను గ్రహించేశక్తి తగ్గిపోతుంది. కొన్ని సందర్భాల్లో విరుద్ధంగా కూడా జరుగుతుంది. దీనివల్ల ఆమె తన దైనందిన జీవితంలో ఏ పనులకయితే అలవాటు పడి ఉంటుందో ఆ పనుల్లో కూడా తప్పులు జరుగుతాయి. ఒక కండక్టరుగా ఉన్న స్త్రీ ఈ కాలంలో తప్పుగా టికెట్ పంచ్ చేయటమో లేక చిల్లర లెక్క పెట్టటంలో చికాకు పడటమో జరుగుతుంది. ఒక డ్రైవరుగానున్న స్త్రీ ఈ కాలంలో బండిని మెల్లగా, భయపడుతూ నడుపుతుంది. అంతేకాక ప్రతి కూడలిలో, ప్రతి మలుపుపై బెదిరిపోతుంది. ఒక లేడీటైపిస్ట్ ఈ దినాల్లో టైప్‌లో పొరపాట్లు చేస్తుంది. ఆలస్యంగా చేస్తుంది. ప్రయత్నించినప్పటికీ పదాలను పోగొడుతుంది. వాక్యనిర్మాణంలో పొరపాట్లు జరుగుతాయి. ఒక అక్షరాన్ని టైప్ చేయాలనుకుంటుంది; కాని వేలు వేరొక అక్షరంపై పడుతుంది. ఒక లేడీ లాయర్ ఈ రోజుల్లో తన కేసును బలంగా, ప్రభావితంగా సమర్పించజాలదు. తన కేసును సమర్పించటంలో ఆమె మానసికశక్తి, వాదనశక్తి రెండూ పొరపాట్లు చేస్తాయి. ఒక మెజిస్ట్రేట్ అయిన స్త్రీయొక్క గ్రహణ శక్తి, నిర్ణయశక్తి రెండూ ప్రభావితమవుతాయి. చక్కగా పాడే స్త్రీ ఈ రోజుల్లో తన స్టైల్‌ను, తన గొంతు మాధుర్యాన్ని కోల్పోతుంది. అంతెందుకు! శబ్దశాస్త్రంలో మంచి ప్రావీణ్యంగల వ్యక్తి కేవలం ఆమె గొంతును విన్నంతనే ఆమె ఋతుదినాల్లో ఉందనే విషయాన్ని చెప్పగలడు. క్లుప్తంగా చెపాల్పంటే ఈ దినాల్లో స్త్రీ మేధస్సులో, నరాల వ్యవస్థలో మందకోడితనం, అస్తవ్యస్థం ఏర్పడతాయి. ఆమె అవయవాలు, ఆమె ఆలోచనలను, ఉద్దేశాన్ని పూర్తిగా నెరవేర్చవు. దానికి బదులు లోపలినుండి ఒక విధమైన కలత, క్షోభ ఆమె ఉద్దేశంపై ప్రభావితమై ఆమె

ఆలోచనాశక్తిని, నిర్ణయ శక్తిని నిర్వీర్యం చేస్తుంది. తత్ఫలితంగా ఆమె ద్వారా అర్థరహితమైన పనులు జరిగిపోతూ ఉంటాయి. ఇలాంటి పనులు జరగ కుండా ఆపటంలో ఆమె వివశురాలైపోతుంది. ఈ పరిస్థితిలో ఆమె స్వతం త్రంగా వ్యవహరించలేకపోతుంది. ఒక బాధ్యతాయుతమైన పనిని నిర్వర్తించ లేకపోతుంది.

ప్రొఫెసర్ లాపిన్‌స్కీ (Prof. Lapinsky) తన గ్రంథం The Development of personality in woman లో ఇలా వ్రాస్తాడు. "రుతుదినాల కాలం స్త్రీని స్వతంత్రంగా వ్యవహరించే శక్తి నుండి అనర్హురాలిగా చేస్తుంది. ఈ కాలంలో ఆమె అవాంఛిత చర్యలకు, పనులకు బానిసై పోతుంది. ఆమెలో ఉద్దేశపూర్వకంగా ఒక పనిని చేయటం, చేయకపోవటమనే శక్తి తగ్గిపోతుంది."

పైనుదహరించిన ఈ మార్పులు ఆరోగ్యవంతమైన స్త్రీలో ఏర్పడ తాయి. అంతేకాక సులభంగా అభివృద్ధి చెందే రోగవ్యవస్థను పుట్టిస్తాయి. ఈ పరిస్థితుల్లో స్త్రీ పిచ్చిదానిలా అయిపోతుందనే సంఘటనలు అనేకం రికార్డుల్లో దొరుకుతాయి. కొద్దిపాటి కోపం తెప్పించినా ఉగ్రమైపోవటం, మౌఢ్యచేష్టలకు పాల్పడటం, చివరికి ఆత్మహత్య చేసుకోవటం కూడా అసాధారణ విషయం కాదు. డాక్టర్ క్రాఫ్ట్ ఎబింగ్ (Dr. Craft Abeing) ఇలా వ్రాస్తున్నాడు. "దైనందిన మామూలు జీవితంలో మృదుస్వభావం, యోగ్యత, మర్యాదస్తురాలైన స్త్రీల్లో కూడా ఋతుదినాలు ప్రారంభం కాగానే అకస్మాత్తుగా మార్పు సంభవిస్తుంది. ఈ కాలం వారిని ఒక తుఫానులా చుట్టుకుంటుంది. వారు ఊరికనే చికాకు పడతారు. అనవసరంగా జగడాలాడుతారు, చిన్న విషయాలకే వాగ్వివాదాలకు దిగుతారు. ఇంట్లోని పనివాళ్ళు, వారి సంతానం, వారి భర్తలు- అందరూ వారి ప్రవర్తనతో ఖిన్నులవుతారు. చివరికి అపరిచిత వ్యక్తులతో కూడా వారు చాలా దురుసుగా ప్రవర్తిస్తారు. వివిధ విషయాలపై ప్రావీణ్యంగల నిపుణులు కూడా

అధ్యయనం చేసిన తరువాత అత్యధిక నేరాలు స్త్రీలు ఋతుదినాల్లో ఉన్న ప్పుడు చేసినవేనని, ఎందుకంటే ఈ కాలంలో వారు తమపై ఆధీనం కలిగి ఉండరనే నిర్ణయానికి వచ్చారు. ఒక గుణవతి ఈ దినాల్లో దొంగతనానికి కూడా పాల్పడగలదు ఆ తరువాత తన ఈ చర్యకు సిగ్గుతో కుంచించుకు పోతుంది. వాయిన్ బర్గ్ (wein berg) తన అధ్యయనాల ఆధారంగా ఇలా అంటాడు. 'ఆత్మహత్య చేసుకున్న స్త్రీలలో 50శాతం స్త్రీలు ఋతుదినాల్లో ఉన్నప్పుడే ఈ చర్యకు పాల్పడ్డారు. ఈ విషయాన్నే దృష్టిలో ఉంచుకొని డాక్టర్ క్రాఫ్ట్ ఎబింగ్ తన అభిప్రాయం చెబుతూ పుష్పవతులయిన స్త్రీలను గురించి ఏదో ఒక నేరంపై విచారణ జరుగుతున్నప్పుడు ఆ నేరం ఆమె ఋతుదినాల్లో చేసి ఉండలేదు కదా అనే విషయాన్ని కోర్టు నిర్ధారణ చేసుకోవాలని అన్నారు.

ఇక ఋతుదినాల కన్నా గర్భం దాల్చిన తరువాత వచ్చేకాలం ఇంకా కఠినంగా ఉంటుంది. డాక్టర్ రిప్రెవ్ (Dr. Reprev) ఇలా వ్రాస్తాడు. 'ఈ స్థితిలో, ఉపవాసాలున్న కాలంలోకంటే అధిక పరిమాణంలో మలం స్త్రీ శరీరం నుండి బయల్పడుతుంది. ఇతర సమయాల్లో స్త్రీ మోయగలిగి ఉండే శారీరక, మానసిక బాధ్యతలను గర్భధారణకాలంలో ఆమె అవయవాలు ఆ బాధ్యత లను భరించలేవు. ఈ కాలంలో స్త్రీ ఏ పరిస్థితులకు లోనవుతుందంటే ఒక పురుషుడు లేక గర్భం దాల్చని సామాన్యస్త్రీ అయినా సరే, ఈ పరిస్థితులకు లోనవుతే వ్యాధిగ్రస్తులయ్యారని నిస్సంకోచంగా చెప్పవచ్చును. ఈ కాలంలో ఎన్నో నెలల వరకు ఆమె పూర్తి నాడీ వ్యవస్థ సన్నగిల్లిపోతుంది. ఆమె మానసిక సంతులనం చెడిపోతుంది. ఆమె మనోమస్తిష్కాల అన్ని అంశాలు ఈ కాలంలో అల్లకల్లోలానికి గురవుతాయి. ఈ కాలంలో ఆమె వ్యాధి, ఆరోగ్యాల మధ్య ఊగిసలాడుతుంది. ఓ చిన్న కారణం కూడా ఆమెను వ్యాధి సరిహద్దుల్లోకి నెట్టేస్తుంది. డాక్టర్ ఫిషర్‌ను అనుసరించి ఆరోగ్యవంతురాలైన స్త్రీ కూడా గర్భధారణ కాలంలో అత్యంత మానసిక ఆందోళనకు గురవుతుంది. ఆమెలో

అనిశ్చితి ఏర్పడుతుంది. పరిపరి విధాల ఆలోచనలు వస్తుంటాయి. మనస్సు కకావికలమైపోతుంది. వివేచన, ఆలోచనా శక్తులు సన్నగిల్లిపోతాయి. హ్యూలాక్ ఏలియస్, అల్బర్ట్‌మోల్ ఇంకా కొందరు ఇతర నిపుణుల ఏకాభిప్రాయం ఏమిటంటే గర్భం దాల్చిన తరువాత చివరినెల అయితే స్త్రీపై శారీరక లేక మానసిక బరువును మోపే అస్కారం ఏమాత్రం లేదు.

కాన్పు తరువాత అనేక వ్యాధులు సోకటానికి, వృద్ధి చెందటానికి అనేక అవకాశాలుంటాయి. కాన్పు సమయంలో ఏర్పడిన గాయాలు, విషపూరిత ప్రభావాలను స్వీకరించటానికి ఎదురుచూస్తుంటాయి. కాన్పుకు పూర్వం ఉన్న స్థితిపై మరలటానికి అవయవాల్లో చలనం ప్రారంభమవుతుంది. దీనివల్ల శారీరక వ్యవస్థ తీవ్ర గందరగోళానికి గురి అవుతుంది. ఎలాంటి ప్రమాదం ఎదురుకాకపోయినా ఆమె తన పూర్వస్థితికి చేరుకోవటానికి ఎన్నో వారాలు పడుతుంది. ఈవిధంగా గర్భం దాల్చినప్పటి నుండి దాదాపు ఒక సంవత్సరం వరకు స్త్రీ వ్యాధిగ్రస్తురాలో లేక వ్యాధిగ్రస్తురాలి వలెనో ఉంటుంది. ఆమెలో పనిచేసే శక్తిసామర్థ్యాలు, సామాన్య స్థితిలో కంటే సగానికి తగ్గిపోతాయి.

ఇక పాలిచ్చే కాలంలో ఆమె తన కోసం బ్రతకదు. ప్రకృతి తన వద్ద ఉంచిన 'ఆ అమానతు' కోసం జీవిస్తుంది. ఆమె శరీరంలోని జీవరసమే ఆమె పిల్లవానికి పాలరూపంలో లభిస్తుంది. ఆమె తీసుకుంటున్న ఆహారంలో కేవలం ఆమెను బ్రతికి ఉంచటానికి అనివార్యమైన భాగం మాత్రమే ఆమెకు చెందుతుంది; మిగిలిందంతా పాల ఉత్పత్తి కోసం వినియోగింపబడుతుంది.

ఆధునిక సమాజంలో పాల సమస్యకు బయటి లేక ఆహారం ద్వారా పరిష్కారం చూపడం జరిగింది. కాని ఇది సరియైన పరిష్కారం ఎంతమాత్రం కాదు. ఎందుకంటే శిశువు పోషణ కోసం ప్రకృతి తల్లి స్థనాల్లో ఉంచిన దానికి మరేదీ ప్రత్యామ్నాయం కాజాలదు. దీన్నుండి శిశువును దూరం చేయడం అన్యాయం, అసహజం, ఘోరమైన తప్పిదం. ఇది స్వార్థం తప్ప ఇంకేమి కాదు.

ఈ విషయానికి సంబంధించి నిపుణులు వెలిబుచ్చే ఏకాభిప్రాయం ఏమిటంటే శిశువు పోషణకు తల్లిపాలకు మించిన ఆహారం వేరొకటి లేదు.

కాని నేడు పిల్లలపోషణ, శిక్షణల కోసం కూడా నర్సింగ్ హోంలు, చైల్డ్‌కేర్ సెంటర్ (Childcare Centre)లు ఉనికిలోకి వచ్చాయి. పిల్లల్ని అందులో చేర్చి, తల్లులు ఎలాంటి చింత లేకుండా ఇంటిబయటి కార్య క్రమాల్లో నిమగ్నులవ్వాలనేది వీరి కోరిక. కాని ఏ నర్సింగ్ హోంలోగాని, చైల్డ్ సెంటర్స్‌లో గాని విజయవంతమైన మాతృత్వం లభించదని వీరెరుగరా? శిశువు జీవిత ప్రారంభకాలంలో ప్రేమ, వాత్సల్యం, త్యాగం, దయాళుత్వం నిస్వార్థ సేవలకు సంబంధించిన ఏ మహోన్నత పరిణామాలు అవసరమో, అవి కూలీకి వచ్చిన కిరాయి స్త్రీల హృదయాల్లో ఎలా జనించగలవు? పిల్లల్ని పోషించే ఈ ఆధునిక పద్ధతులు ఇంకా వినియోగంలోకి రాలేదు. పిల్లలను పోషించే ఈ కర్మాగారాల్లో ఎదిగిన తరాలు ఇంకా మానవ సమాజంలోకి రాలేదు. ఈ రకంగా పెరిగిన పిల్లల నడవడికలు, నైతికతలు, వారి ఘన కార్యాలు ఇంకా ప్రపంచం ముందుకు రాలేదు. అందుకని కృత్రిమంగా పెంచే ఈ పద్ధతి సామర్థ్యం, అసామర్థ్యాల గురించి ఒక అవగాహనకు వచ్చే అవకాశం ఏర్పడలేదు. తల్లి ఒడికి నిజమైన ప్రత్యామ్నాయం ప్రపంచం కనుగొన్నదనే వాదనకు ఇంకా సమయం రాలేదు. శిశువు పోషణ, శిక్షణలకు సరియైన, సహజ స్థానం తల్లి ఒడి మాత్రమే అనే వాస్తవం నేటివరకు ఇంకా చెదిరిపోలేదు.

స్త్రీ పురుషుల శారీరక, మనోమస్తిష్కాల శక్తిసామర్థ్యాలు ఒకేవిధంగా, సమానంగా ఉన్నప్పటికినీ ప్రకృతి ఇద్దరిపై సమాన భారం వేయలేదనే విషయాన్ని సాధారణ బుద్ధిజ్ఞానాలు గల వ్యక్తి కూడా గ్రహించగలుగుతాడు. మానవ సంతతి మనుగడ కోసం విత్తనాన్ని నాటటం తప్ప వేరే ఏ పనికూడా పురుషునికి అప్పగించబడలేదు. ఈ బాధ్యతను నెరవేర్చిన తరువాత అతను

స్వతంత్రుడు, జీవితంలోని ఏరంగంలోనైనా అతను ప్రవేశించటానికి సర్వస్వతంత్రుడు. దానికి బదులు మానవ జాతి మనుగడ, వృద్ధివికాసానికి సంబంధించిన భారం స్త్రీపై మోపబడింది. ఈ భారాన్ని, ఈ బాధ్యతను మోయ టానికి తల్లి గర్భంలో పిండంగా ఏర్పడినప్పటి నుండి ఆమెను తీర్చిదిద్దటం జరుగుతుంది. దీనికోసమే ఆమె శరీరమనబడే మిషనులోని ఒక్కొక్క భాగాన్ని అనువుగా మలచటం జరుగుతుంది. ఈ కార్యభారానికి అలవాటు పడేందుకే యవ్వన కాలమంతా కూడా ఆమె ఋతుదినాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. మూడు నుండి ఏడు లేక పది దినాల ఈ సంకటం, ఆమెను ఒక గొప్ప కార్యభారాన్ని లేక ఇతర శారీరక లేక మేధాపరమైన కష్టాన్ని ఎదుర్కోనివ్వ జాలవు. ఈ లక్ష్యం కోసమే ఆమెకు గర్భధారణ, ఆ తరువాత కాన్పు వరకు దాదాపు ఒక సంవత్సరం కఠినంగా గడుస్తుంది. ఈ ఒక్క సంవత్సర కాలం ఆమెను దాదాపుగా జీవచ్ఛవంలా చేసేస్తుంది. ఈ బాధ్యతను, ఈ భారాన్ని మోయటానికే పాలిచ్చే రెండు సంవత్సరాల కాలం ఆమె తనకోసం కాదు మానవత్వం కోసం, మానవజాతి మనుగడ కోసం బ్రతుకుతుంది. తన రక్తానికి పాల రూపమిచ్చి మానవ ఉద్యానవనానికి తన రొమ్ములోని సెలయేర్ల ద్వారా నీరందిస్తుంది. ఈ భారాన్ని నెరవేర్చటం కోసమే శిశువు సంరక్షణలోని ప్రారంభపు ఎన్నో సంవత్సరాలు ఆమె ఎంత కష్టంగా, ఎంత త్యాగంతో, ఎంత నిస్వార్థంగా గడపవలసి వస్తుందో మీరేమైనా ఊహించగలరా? కంటినిండా నిద్రకుగాని, తృప్తిగా తిండికి కాని నోచుకోదు. ఆమె రాత్రింబవళ్ళు శిశు సంరక్షణలో, శిశువును సాకటంలోనే గడిచిపోతాయి. ఆమె తన సౌఖ్యాన్ని, తన ఆనందాన్ని, తన సంతోషాన్ని, తన కోరికల్ని- ఒక్కటేమిటి తన సర్వస్వాన్ని రాబోయే సంతతి కోసం, భావితరాల కోసం త్యాగం చేస్తుంది. మానవజాతికి, మానవత్వానికి స్త్రీ అందించే ఈ సహకారం మానవ మనుగడ కోసం ఆమె చేస్తున్న ఈ త్యాగం రాబోయే తరాల కోసం తన సర్వస్వాన్ని సమర్పించు కుంటున్న ఈ తీరు మీకు

ఇంకెక్కడైనా కనబడుతుందా? శిశువును తల్లి ఒడినుండి దూరంచేస్తే అతని ఉనికెక్కడ ఉండగలదు? శిశువును తల్లి ఒడినుండి దూరం చేయటం లేక స్త్రీని తల్లిగా తన బాధ్యతలు నెరవేర్చకుండా అడ్డంకులు సృష్టించటం లేక ఆమెను తన విద్యుక్తధర్మాన్ని నెరవేర్చకుండా పెడదారులు చూపించటం ఎంత అవివేకమైన, అసంబద్ధమైన, ప్రమాదకరమైన ఆలోచనలో గుర్తించారా? స్త్రీ తన విద్యుక్తధర్మాన్ని, ప్రకృతి సిద్ధమైన తన బాధ్యతను తల్లి మాత్రమే నిర్వహించగలిగే కర్తవ్యాల నుండి తప్పుకుంటే మానవ శిశువులు ఏమైపోతారో ఊహించగలరా? రాబోయే తరాల ఉనికే ప్రశ్నార్థకంగా మారదా? మానవ మనుగడకే ప్రమాదసేర్పడదా?? ప్రకృతిని ఎదురించే శక్తిసామర్థ్యాలు, యోగ్యతలు ఎవ్వరికీ లేవు. ప్రకృతి ఎవరికీ లొంగదు. ఎదురించిన వారిని నాశనం చేసిగాని విడిచిపెట్టదు. ప్రకృతి నియమావళిని వికృతం చేయడానికి ప్రయత్నిస్తే ప్రకృతికి వాటిల్లే నష్టమేమీ ఉండదు. దానితో ప్రభావితమయ్యే వారే తీవ్ర సంక్షోభానికి, వినాశనానికి గురి అవుతారు. అందుకని ప్రకృతి నియమాలను ఉల్లంఘించటంలో అత్యుత్సాహం చూపటం ఎంతో ప్రమాదకరం, మానవ మనుగడకే ఎసరు వస్తుంది. చెరపటం, చెడగొట్టటం, నేలమట్టం గావించటం, నాశనం చేయటం సులభమే. కాని నిర్మించటం, స్థాపించటం, ఉనికిలోకి తేవటం, వ్యవస్థీకరించటం అత్యంత కష్టంతో కూడుకున్న పనులు. అందుకని ప్రకృతి ప్రసాదించిన స్త్రీ పురుష పరిస్థితుల్లో, స్థాయిలలో ఇష్టం వచ్చిన మార్పులు, చేర్పులు చేయగోరేవారు విషయాన్ని ప్రశాంతంగా ఆలోచించాలి.

మానవజాతి ఉనికి, మనుగడల కోసం, భావి తరాల పోషణ, శిక్షణ, వృద్ధివికాసాల కోసం స్త్రీ ఎన్నెన్ని త్యాగాలు చేయవలసి వస్తుందో, ఎన్నెన్ని కష్టాలు అనుభవించవలసి వస్తుందో పైన వివరిస్తూ వచ్చాము.

ఇక న్యాయాన్యాయాలపై విచారించే బాధ్యత మీపై విడిచి పెడుతున్నాము. స్త్రీ తన ప్రకృతిసిద్ధమైన బాధ్యతలను- పురుషుడు రవ్వంత కూడా ఆమెకు సహాయకారిగా లేని ఈ బాధ్యతలను నెరవేరుస్తూనే, సామాజిక బాధ్యతలను కూడా పురుషునితో సమానంగా నెరవేర్చాలని కోరటం సమంజసమేనా? న్యాయమేనా? పురుషుడు ప్రకృతిపరమైన అన్ని బరువుబాధ్యతల నుండి దూరంగా ఉంచబడ్డాడు. అతనికి ఋతుక్రమాలు లేవు, గర్భధారణలు లేవు, కాన్పులు లేవు. ఈ బాధలన్నిటికీ అతను దూరంగా ఉన్నాడు. కనుకనే అతనిపై బాహ్యమైన సాంఘిక, సామాజిక బాధ్యతలు మోపటం సమంజసం, సహేతుకం. అంతకుముందు నుండే ప్రకృతి సిద్ధమైన బాధ్యతల భారాన్ని మోస్తున్న స్త్రీని తన బాధ్యతల్లో కూడా పాలుపంచుకోమని, అన్ని రంగాల్లో తనకు సహాయకారిగా ఉండాలని పురుషుడు కోరటం ఎంతవరకు సమంజసం, న్యాయం? రాజకీయాల్లో, న్యాయస్థానాల్లో, కార్మిక రంగాల్లో, వ్యాపార వ్యవసాయ రంగాల్లో, దేశరక్షణ, శాంతిభద్రతలు వంటి విషయాల్లో కూడా తనతో సమానంగా పాలుపంచుకోవాలని పురుషుడు కోరటం ఎంత వరకు భావ్యం? అంతేకాదు, మా సొసైటీల్లోకి వచ్చి మమ్మానందింప జేయమని, మా కోసం ఆనందోల్లాసాలను, భోగవిలాసాలను, సుఖ సౌఖ్యాలను కూడా సమకూర్చమని కోరటం న్యాయమేనా? కాదు, ఇది న్యాయంకాదు. ఘోరమైన అన్యాయం, దారుణమైన దౌర్జన్యం.

స్త్రీపై ఇంటిబయటి బాధ్యతలను అప్పగించటం ఒక్కటే అన్యాయం కాదు, పురుషులు మాత్రమే చేయదగిన పనులు చేయటానికి ఆమెకు అలాంటి శక్తిసామర్థ్యాలు కూడా లేవు. ఆమె శారీరక వ్యవస్థ పురుషుని శారీరక వ్యవస్థకు భిన్నంగా ఉంది. ఎవరికైతే ప్రకృతి పరంగా ధృఢత్వం ప్రసాదించబడిందో, ఎవరికైతే నిరంతరం శ్రమించగలిగే శక్తి ఇవ్వబడిందో, ఎవరయితే ఒకేరకంగా, ఒకే సామర్థ్యంతో, అన్నికాలాల్లో శ్రమించగలరో అలాంటివారితో

ఎల్లప్పుడూ ప్రతి నెలా ఒక సుదీర్ఘకాలం యోగ్యతలేమితో బాధపడేవారిని ఎలా పోల్చగలము? స్త్రీలతో కూడిన ఒక సైనిక పటాలంలో అత్యధిక శాతం ఋతుదినాలతో, కొంత శాతం కాన్పు వల్ల బెడ్‌రెస్ట్‌లో ఉండి, మరికొంత శాతం గర్భధారణ కారణంగా అశక్తులై ఉంటారో యుద్ధమే కనుక సంభవిస్తే, పరిస్థితి ఏవిధంగా ఉంటుందో కాస్త ఆలోచించండి. పోనీయండి, సైనిక బాధ్యతలు చాలా కష్టంగా ఉంటాయని అందుకని దానిగురించి చర్చించటం మీకు రుచించకపోవచ్చు. కాని పోలీసు, న్యాయవ్యవస్థ, పరిపాలనా వ్యవస్థ, రాయబార బాధ్యతలు, రైల్వే, పారిశ్రామిక, వ్యాపార వ్యవహారాలు- వీటిలో ఏ రంగం నిరంతర వ్యవహార దక్షత కోరదు? ప్రతి రంగం తన మనుగడ, వృద్ధి వికాసాల కోసం నిరంతరం సంపూర్ణ శ్రద్ధనే కాంక్షిస్తుంది.

స్త్రీలతో పురుష సంబంధమైన పనులు తీసుకోదలిచినవారి ఉద్దేశ మేమిటి? స్త్రీలందరినీ స్త్రీయేతరులుగా మార్చి, మానవ సంతతిని నాశనం చేయదలిచారా? పైనుదహరించిన అంశాలలో మీరు దేనిని స్వీకరించినా స్త్రీని, పురుష సంబంధమైన పనులకోసం తయారు చేయటం ప్రకృతి అభిలాషకు పూర్తిగా విరుద్ధమే అవుతుంది. ఇలా చేయటం వల్ల మానవత్వానికి గాని, స్త్రీజాతికి గాని ఏవిధంగానూ లాభించదు. జీవశాస్త్రం ప్రకారం స్త్రీని శిశువును కనటానికి, పోషించటానికి మాత్రమే రూపొందించటం జరిగింది. అందుకని శారీరకంగానే కాక, మానసికంగా కూడా ఆమెకు నిర్దేశించిన ప్రకృతిసిద్ధమైన తన బాధ్యతల్ని నెరవేర్చటానికి అవసరమైన యోగ్యతల్ని, ప్రత్యేకతల్ని మాత్రమే ఆమెకు ప్రసాదించటం జరిగింది. అనగా ప్రేమ, దయ, కనికరం, వాత్సల్యం, మృదు హృదయం, సూక్ష్మగ్రాహ్యం, సున్నితమైన భావనలు. లైంగిక జీవితంలో పురుషుడ్ని ఆకట్టుకునే ఆకర్షణ శక్తి స్త్రీలో ఉన్నాయి. స్త్రీలోని సిగ్గు, బిడియం, ఏకాంతం, దూరముండటం, తప్పు

కోవటం ఇవన్నీ దాని చిహ్నాలే. ఆమెలో కాఠిన్యం, తీవ్రతలకు బదులు మృదుత్వం, కోమలత్వం, నమ్రత, బెరుకు కనబడతాయి. పోకిరితనం, వెకిలి తనాలకు బదులు సిగ్గు, బిడియం కనబడతాయి. మొండితనానికి బదులు రాజీపడే స్వభావం కనబడుతుంది. స్థిరత్వం, దృఢత్వం, అహంకారానికి బదులు ఆమెలో మెత్తబడిపోయే, లొంగిపోయే, కలుపుకుపోయే స్వభావం కనబడుతుంది. ఇవి సామాన్యంగా ఒక స్త్రీలో ఉండే కొన్ని సహజగుణాలు. వీటిని మంచీ లేక చెడూ అనే బదులు ప్రకృతి ప్రసాదించిన ప్రత్యేకతలంటే బాగుంటుంది. ఈ గుణాలతో, ఈ ప్రత్యేకతలతో ఈ రంగాల్లో ఆమె ఎలా పని చేయగలుగుతుంది? ఒకవేళ ఈ రంగాల్లో ప్రవేశించినా, ఆమె ఎలా సఫలీకృతు రాలవుతుంది?

ఈవిధానంలో స్త్రీ అభివృద్ధి కాదు, క్షీణతే కనబడుతుంది. ప్రకృతి సహజమైన యోగ్యతల్ని, ప్రత్యేకతల్ని క్షీణింపజేసి లేక రూపుమాపి, ప్రకృతి సిద్ధంగా అందులోలేని యోగ్యతల్ని, ప్రత్యేకతల్ని అందులో సృష్టించటానికి ప్రయత్నించటం అభివృద్ధి అనిపించుకోదు.

జీవితంలోని ఒక రంగంలో స్త్రీలు బలహీనంగా ఉన్నారు, పురుషులు ముందంజలో ఉన్నారు కాని, అదే జీవితంలోని వేరొక రంగంలో స్త్రీలు ముందంజలో ఉన్నారు, పురుషులు బలహీనంగా ఉన్నారు. పాపం స్త్రీలు ఏ రంగంలో బలహీనంగా ఉన్నారో ఆ రంగంలో మీరు వారిని పురుషులతో పోటీకి నిలబెట్టారు. దీని పర్యవసానం అందరికీ తెలిసిందే! స్త్రీలు పురుషులతో వెనుకబడే ఉంటారు. ఎందుకంటే జన్మతః వారు ఈ రంగంలో పురుషుల కంటే బలహీనంగా సృష్టించబడ్డారు. అందుకని మీరెంత ప్రయత్నించినా స్త్రీల నుండి అరిస్టాటిల్, అబిసీన, కాంట్, హేగల్, ఖయ్యాం, షేక్స్పియర్, అలె గ్జాండర్, నెపోలియన్, సలాహుద్దీన్ అయ్యూబి, నిజాముల్ ముల్క్ , బిస్మార్క్ లాంటి వారికి పోటీనిచ్చే ఒక్క వ్యక్తిత్వాన్ని కూడా నిలబెట్టలేరు. దీనికి

భిన్నంగా ప్రపంచంలోని పురుషులందరూ కలిసి తలలు బద్దలు కొట్టుకున్నా తమ వర్గం నుండి ఒక సాధారణ మాతృమూర్తిని కూడా సృష్టించలేరు.

ఇందులో సమాజానికిగాని, సంస్కృతికిగాని ఎలాంటి లాభంలేదు సరికదా, ఇంకా నష్టమే వాటిల్లుతుంది. మానవ జీవితానికి, సంస్కృతికి కాఠిన్యత, ధృడత్వం, తీవ్రత, ప్రచండత ఎంత అవసరమో మృదుత్వం, కోమలత్వం, కనికరం, బెరుకులు కూడా అంతే అవసరం. మంచి సైనికాధికారులు, ఉత్తమ రాజతంత్రజ్ఞులు, మంచి పరిపాలకులు ఎంత అవసరమో, మంచి పత్నులు, మంచి తల్లులు, మంచి గృహిణులు కూడా అంతే అవసరం. ఈ రెండు అవసరాలు సరిసమానమైనవి. ఈ రెండిటిలో ఒకదానిని పెంచి, ఇంకొక దాన్ని తగ్గించటానికి వీల్లేదు. ఈ రెండు కూడా తమతమ స్థానాల్లో అనివార్యమైనవి. అందుకని ఈ రెండింటిలో ఏ ఒక్కదాన్ని చిన్నచూపు చూసినా మానవ సంస్కృతి నష్టపోక తప్పదు.

కాబట్టి స్త్రీకి గౌరవప్రదమైన హోదానివ్వాలి. ఆమెకు న్యాయంగా లభించవలసిన సామాజిక, ఆర్థిక హక్కులను గుర్తించాలి. ఆమెపై కేవలం గృహబాధ్యతల భారం మాత్రమే మోపాలి. ఇంటిబయటి వ్యవహారాలు, పురుషునికి అప్పగించాలి. ఏ సంస్కృతి, ఏ సమాజం ఈ కార్యాచరణ విభజన లేక బాధ్యతల విభజనను రూపుమాపటానికి ప్రయత్నిస్తుందో ఆ సంస్కృతి, ఆ సమాజం తాత్కాలికంగా భౌతికపరంగా కొంత అభివృద్ధి చెందినట్లు పైకి కన్పించినా చివరికి అది నాశనంకాక తప్పదు.

ప్రకృతి నియమించిన కార్యాచరణ విభజనను దృష్టిలో పెట్టుకొని, కుటుంబ నిర్మాణం, సమాజంలో స్త్రీపురుషుల బాధ్యతలను నిర్ణయించటానికి కావలసిన ముఖ్యాంశాలు ఈక్రింది విధంగా ఉండాలి:

1. కుటుంబపోషణ నిమిత్తం భుక్తిని సమకూర్చటం, కుటుంబాన్ని నియంత్రించటం, సంరక్షించటం, సామాజిక వ్యవస్థలో శ్రమ, కష్టాలతో కూడిన బాధ్యతల్ని నిర్వర్తించటం- పురుషునికి అప్పగించబడాలి.

2. పిల్లల పోషణ, కుటుంబ బాధ్యతలు, ఇంటిలో ప్రశాంత వాతావరణాన్ని ఏర్పరిచి, ఇంటిని స్వర్గతుల్యంగా తీర్చిదిద్దటం స్త్రీ బాధ్యతగా గుర్తించాలి. ఈ లక్ష్యసాధన కోసమే ఆమెకు మంచి విద్యాశిక్షణలు ఇప్పించాలి.

3. కుటుంబ వ్యవస్థను సక్రమంగా నడపటానికి, అరాచకం నుండి రక్షించటానికి ఎవరో ఒక వ్యక్తికి చట్టపరిధిలో అవసరమైన యాజమాన్యపు అధికారాలు ఇవ్వబడాలి. లేకుంటే అధికారి, నాయకుడు లేని సైన్యపు గతే ఈ కుటుంబానికి పడుతుంది. మరి ఆ వ్యక్తి ఎవరై ఉండాలి? అలాంటి వ్యక్తి కేవలం పురుషుడు మాత్రమే కాగలడు. ఎందుకంటే కుటుంబంలోని రెండవ సభ్యుడు అనగా స్త్రీ- మాటిమాటికి ఋతుక్రమాలు, గర్భధారణలతో శారీరకంగా, మానసికంగా బలహీనమవుతుంటుంది.

4. ప్రకృతి సిద్ధమైన ఈ విభజనను, ఈ శిక్షణను, ఈ వ్యవస్థను పరిరక్షించటానికి వివేకహీనులైనవారు తమ అజ్ఞానంతో స్త్రీపురుష కార్యాచరణ పరిధుల్ని ఏకంచేసి, శ్రేష్ఠమైన సామాజిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయకుండా జాగ్రత్త వహించటానికి సామాజిక వ్యవస్థలో సముచితమైన నియమ నిబంధనలను ఏర్పాటు చేయాలి.

- సమాప్తం -